ప్రజాశక్తి

Vol. 7, no. 15

(Oct. 10, 1945)

బెజవాడ, 1945

Record no. 683

Prajāśakti


Vol. 7, no. 15

(Oct. 10, 1945)

Bejavāḍa, 1945

కాంగ్రెసు-లీగ్-కమ్యూనిస్టు ఐక్యతకు

కమ్యూనిస్టుపార్టీ నూతనపంథా



పి. సి. జోషి

దేశభక్తియుత సంస్థల్లో కాంగ్రెసు తలమానికమ్ము. దేశానికి త్వరలో స్వాతంత్ర్యం చేకూర్చి, విజయ పరంపరలు సాధిస్తున్న ప్రపంచ ప్రజాశక్తులతో మనకు గాఢమైత్రిని కుదర్చగల చక్కని ప్రజాస్వామ్య కార్యక్రమాన్ని నిర్ణయించి, కాంగ్రెసు నాయకవర్గం యావద్భారత జాతిని ముందుకు నడుపుతుందని కమ్యూనిస్టులం కొండంత ఆశతో ఎదురు చూశాం. గత మూడేళ్ళలోను మేము ముఖ్యంగా ఈ నాయకుల విడుదలకోసమే ఆందోళనచేస్తూ వచ్చాం. నిరివి జైళ్ళలో మ్రగ్గజేసి, ప్రతిష్ఠంభనను కొనసాగిస్తూ వచ్చిన సామ్రాజ్యవాద ప్రభుత్వాన్ని తూర్పారబడుతూ ప్రచారం చేశాం.

ఈ మూడేళ్ళలో పడినన్ని బాధలు భారతప్రజ ఇదివర కేనాడూ అనుభవించలేదు; దుర్భరమైన ఈ కష్టసముద్రంలో నుంచి తమను ఒడ్డుచేరుస్తారని కాంగ్రెసు నాయకులవంక దీనంగా చూచారు ప్రజలు.

దేశంయొక్క ఆర్థిక జీవనం నామరూపాలు లేకుండా ఛిన్నాభిన్నమయే ప్రమాదం నేడు కలిగినంతగా ఇదివర కెన్నడూ కలుగలేదు; సుస్థిరమైన కొత్తపునాదులమీదదీని పునర్నిర్మించవలసిన ఆవశ్యకత ఈనాడు ఎంతో ఉంది. దీనిని నెరవేర్చడానికి తగిన అవకాశాలుగూడ నేడున్నంతగా ఇదివరకెన్నడూ లేవు.

రాజకీయవిచ్ఛిన్నం, విరాళ ఈనాడు అలముకున్నంతగా ఇదివరకెన్నడూ అలముకొనలేదు; మరోవైపు, ప్రజాసామాన్యంలో రాజకీయాలపై నేడున్నంత శ్రద్ధ మునుపెన్నడూ చూచి ఎరుగం.

ప్రతిష్ఠంభనకు సంబంధించిన చిక్కుసమస్యల నన్నిటినీ ధైర్యంగా ఎదుర్కొని, దేశ స్వాతంత్ర్యాన్ని సాధించి, ప్రజాస్వామిక భారత దేశాన్ని నిర్మించవలసిన ఆవశ్యకత మనజాతీయోద్యమ చరిత్రలో నేడున్నంత ఎక్కువగా మును పెన్నడూ లేదు.

అహంకారం

కాంగ్రెసు నాయకవర్గంపై ఇంత మహత్తర కార్యభారం ఉంది. యదార్థ పరిస్థితులను గమనించి, బుద్ధికుశలతనుతా వినియోగించి, ఆలోచించవలసిన బాధ్యత ఇంతగా ఉంది. కాని, విడుదలైవచ్చిన కాంగ్రెసు నాయకవర్గం ఈకార్యభారాన్ని గుర్తించలేదు. ఆలోచనకు పూనుకోలేదు. సంకుచిత బుద్ధితో తనకున్న అహంకారాన్ని ప్రదర్శించింది. సామ్రాజ్యవాదులు తెచ్చిపెట్టిన ప్రతిష్ఠంభనలో మూడేళ్లు తల్లడిల్లిన దేశానికి తిరిగి నిర్మాణాత్మకమైన కార్యక్రమమిచ్చి, ముందుకునడుపగల మహదవకాశం ఎ. ఐ. సి. సి. సమావేశంలో కలిగింది.

కాని, అక్కడ కాంగ్రెసు నాయకవర్గం చేసిందేమిటి? భారత స్వాతంత్ర్యాన్ని సాధించే మార్గం చూపలేదు. పైగా స్వాతంత్ర్యాన్ని చేకూర్చగల శక్తుల్ని మరింత చీలదీసి, ఛిన్నాభిన్నం చేయగల పంథాను కాంగ్రెసు మహాసంస్థ నెత్తిపై రుద్దాను.

ఈ మూడేళ్ళలో కాంగ్రెసు చాల బలపడింది. ఎవ్వరూకాదనలేరు. కానిలీగుబలంకూడా ఈకాలంలో వృద్ధిపొందింది. దాని బలాన్ని చిలవలు పలవలుగ చిత్రించి, దీని బలాన్నిగుర్తించకపోవడం గుడ్డితనం.

కాంగ్రెసు లక్ష్యం యావద్భారత దేశ స్వాతంత్ర్యం. ముస్లిం జన్మభూముల స్వాతంత్ర్యం లీగు ఆశయం. భారత దేశానికి స్వయం నిర్ణయాధికారాన్ని ఇవ్వవలసిందని ఒక వైపు బ్రిటిష్‌వారినికోరుతూ, మరోవైపు ఆహక్కునే కోరుతూన్న ముస్లింసోదరుల వాంఛను కాలదన్నడం అన్యాయం. కాంగ్రెసు ఒక మతసంస్థకాదనేమాట నిజమే. కాని ముస్లిం ప్రజల్లో అత్యధిక భాగం లీగును మాత్రమే తమ జాతీయ సంస్థగా గుర్తిస్తున్నారు. దీనిని గమనించక లీగును ఒక మతసంస్థగా ఆడిపోస్తుంది కాంగ్రెసు. అదే సమయంలో కాంగ్రెసు ముస్లింలు కూడా ఎక్కువగా లీగులో చేరిపోతున్నారు. పరిస్థితుల పోకడను గుర్తించకపోవడం తెలివి తేటలకు చిహ్నంకాదు.

భారత స్వాతంత్ర్యం అనే మంత్రాన్ని వల్లిస్తూ కాంగ్రెసు నాయకవర్గం ముస్లింసోదరుల స్వేచ్ఛను అరికడుతూంది; జాతీయైక్యత పేరు చెప్పి రెండు ప్రధాన రాజకీయసంస్థలను ఎడమొగం పెడమొగం చేస్తూంది. ముమ్ముందు జాతీయైక్యతను నిర్మించాలంటే, అందుకు మార్గం ఈనాడు వున్న చీలికలను మరింత తీవ్రంచేయడం కాదు;

అన్నదమ్ములను చీలదీయడం

లీగ్‌తో ఇక మాకేలాంటి పనిలేదని కాంగ్రెసు నాయకవర్గం అంటున్నది అంటే, భారత స్వాతంత్ర్యం కోసం జాతీయైక్యతను నిర్మించవలసిన పవిత్రబాధ్యతను కాలదన్నిందన్నమాట; సర్దార్ పటేల్, పండితనెహ్రూ లీగ్‌పై యుద్ధం ప్రకటించారంటే, హిందువుల్ని - ముస్లింలను రెండు శత్రుశిబిరాలుగ చీలదీస్తున్నా రన్నమాట; లీగ్ మెడలు విరవడానికి కాంగ్రెసు నాయకులు బ్రిటిషు ప్రభుత్వ సహాయాన్నర్థిస్తున్నారంటే, బ్రిటిషు సామ్రాజ్యవాదుల వలలో పడుతూ, భారత స్వాతంత్ర్యాన్ని వాయిదా వేయటానికి అవకాశం కలిగించుతున్నా రన్నమాట.

మన అంతరంగిక వ్యవహారాల్లో జోక్యం కలిగించుకోమని బ్రిటిష్ సామ్రాజ్యవాదుల్ని బొట్టుపెట్టి పిలవడం దేశభక్తి అనిపించుకుంటుందని మేము అనుకోము. ఇది భారత స్వాతంత్ర్యానికి దారితీయదు. బ్రిటిష్ సామ్రాజ్యవాదులు తాము తయారుచేసిన కూప్లండు ప్లానును మనపై బలవంతంగా రుద్దడానికే అవకాశం కలిగిస్తుంది.

జాతీయైక్యత పేరుచెప్పి ముస్లిం సోదరులపై ధ్వజమెత్తడము సబబైన పని అని మేము అనుకోము. ఈపంథా అంతర్యుద్ధాన్ని తెచ్చిపెడుతుందేగాని, ఐక్య భారత రాజ్యాంగానికి ఎంత మాత్రం దారితీయదు.

కమ్యూనిస్టుపార్టీపై కత్తి దూశారు

కాంగ్రెసు నాయకవర్గం ఈ విధంగా లీగువైపు పెడమొగం తిప్పింది. కాంగ్రెసు ఫాసిస్టు అనుకూలసంస్థ అని ఈమూడేళ్లూ సామ్రాజ్యవాదులు ఇంటాబయటా సాగిస్తూ వచ్చిన విషప్రచారాన్ని ఎదుర్కొన్న మాపార్టీపైకూడ కత్తి దూసింది. ప్రతిష్ఠంభనను కొనసాగించి ప్రజలస్వాతంత్ర్య వాంఛను ప్రతిఘటిస్తూవచ్చిన అభివృద్ధి నిరోధకశక్తుల్ని తూర్పారబట్టిన మాపైన కాంగ్రెసు నాయకత్వం యుద్ధం ప్రకటించింది.

జైళ్ళలో ఉన్నంతకాలం ఆగస్టు ఘటనలకు బాధ్యత తమదికాదని ఎలుగెత్తి చాటారు ఈ కాంగ్రెసు నాయకులు; ఆ ధోరణిలోనే బ్రిటిష్ వైస్రాయితో ఉత్తరప్రత్యుత్తరాలు కూడా సాగించారు. జైల్లో నుంచి బయటికి వచ్చిరావడంతోనే ఈధోరణిని మార్చారు. ఆఆగస్టు ఘటనలకు "ఆగస్టు పోరాటం" అని ముద్రవేసి, దానిలో పాల్గొననందుకు మమ్మల్ని [illegible] ఆరంభించారు. ఈ విషయంలో మా వాదనను [illegible] వారికి అక్కరలేకపోయింది. ఇది, నీతి [illegible] ఎందుకాగారుగువస్తే తత్వమని మేము [illegible] ఏవరనగలరు;

ఈ మూడేళ్ళలో జరిగిన విషయాలను యథాతథంగా పరిశీలించి, [illegible] పార్టీలను గురించి, గ్రూపులను గురించి వాస్తవిక దృష్టితో తగు నిర్ణయాలకు రావడానికి పూనుకోకుంటున్నారు కాంగ్రెసు నాయకులు. ఫాసిస్టు పెనుభూతం ఇంటి గుమ్మంవరకు వచ్చిందన్న విషయాన్ని విస్మరిస్తున్నారు. విధ్వంసక కార్యక్రమం ఊసే ఎత్తడంలేదు. పరాయి ప్రభుత్వంవల్ల ద్వేషంకొద్దీ స్వాతంత్ర్యారాధకులయిన ప్రజలు జరిపిన పోరాటంగా ఆగస్టు ఘటనల్ని స్తుతిస్తున్నారు. ఈ పోరాటంలో పాల్గొనకుండా, "అపకీర్తి పక్షం"తో చేరినవారిగా మమ్మల్ని ఆడిపోస్తున్నారు. ఈ మూడేళ్ళచరిత్ర తామూహించు కున్నట్టిదే అయినట్లయితే, మేము నిలువనీడలేకుండా అంతరించిపోయేవారిమనీ, ఈనాడు మమ్మల్ని

(మిగతా 4 వ పేజీలో)

Reqd. No M. 4486 0-2-0

ప్రజాశక్తి

సంపుటి 7 బుధవారం 10—10—45 సంచిక 15

కంచుగడా

రెండు విట్టాళ్ళ పాక ఉన్న ప్రతి విమ్నజాతి పౌరునికీ వోటింగు హక్కుంటుందని "ప్రజాశక్తి"లో ప్రకటించగనే, అది ఆంధ్రులలో ఎక్కడలేని చైతన్యం కలిగించింది.

కృష్ణాజిల్లా గుడివాడ తాలూకాలో తొన్నపాడు అనే గ్రామం ఉంది. అక్కడ చదువు ఉన్న విమ్నజాతివారు 100 మంది ఉన్నారు. 125 మందికి రెండు విట్టాళ్ళ పాకలున్నాయి. కాని, అప్పుళ్ళో ఎంతమందికి వోట్లున్నాయో మీకు తెలుసా? కేవలం 15 మందికి మాత్రమే. "ప్రజాశక్తి" వార్త అప్పుళ్ళో అపూర్వమైన ఉత్సాహం కలిగించింది. ఏయింట్లో చూచినా వోట్ల గొడవే. పల్లె అంతా కోలాహలంగా ఉంది. వోటుహక్కుగల ప్రతివ్యక్తి వోటరుగా చేరాలని సంకల్పించుకున్నారు. ఇదంతా చూస్తుంటే ఎవరి శరీరం ఉప్పొంగదు చెప్పండి! కాని, గుడివాడ తాలూకా రైతుకాంగ్రెసు అధ్యక్షుడో, కార్యదర్శో వివరం తెలియదుగాని - ఆయనకూ, ఆయన అనుచర బృందానికీ మాత్రం ఇదంతా విపత్కాలంగాతోచింది! అప్పుళ్లో రెండు పార్టీలున్నాయి. రెండుపార్టీలనాయకులూ ఇది కరకే సైండోవరు చేయబడ్డారు. గ్రామోద్యోగి కూడా ఒకపార్టీలో సైండోవరు చేయబడ్డారు. ఈ మునసబుకి కమ్యూనిస్టుపార్టీ అంటే మంట. ఇంకేం - ఆయన కనిపెట్టారు, రైతుకాంగ్రెస్ నాయకుడు. రెండు విట్టాళ్ళు గలిగిన 125 యిండ్లలో 6 యిండ్లను మాత్రమే ఆయన వాయించారు. లైబ్రరీలో మకాంచేసి ఉన్న స్పెషల్ రివిజన్ ఇన్‌స్పెక్టరు కరణాన్ని పిలిచి, ఆతను తయారు చేసిన జాబితామీద యున్నారు. విస్పారంటి పాములబుట్ట! అంతా మోసమే! గగ్గోలుపెట్టారు విమ్నజాతుల వారంతా. ఇదంతాఅయోమయంగా కనిపించింది ఇన్‌స్పెక్టరుగారికి. "సరే, దాన్ని అవంతి ప్రస్తుతం. మొదట చదువుకున్న వారందరూ దరఖాస్తులు పూర్తిచేసి యివ్వండి" అన్నారు. ఒకరు తరువాత ఒకరు దరఖాస్తులు పూర్తి చేయటానికి ముందుకొచ్చారు. కాని, మునసబుగారు కలం సాగనివ్వరే! ఒక గడ్డం మాసిన రైతును, నీకు మైనారిటీ దాటలేదంటారు. అప్పుళ్లోనేపుట్టిపెరిగిన మరొకవ్యక్తిని మచిలీ గ్రామంలో 120 రోజులనుంచి కాపురము ఉండడం లేదంటారు. తనకు వ్యతిరేకి అయిన ఒక దగ్గర బంధువును అసలు తాను ఎరుగనే ఎరుగ నంటారు.

దీనితో దరఖాస్తు దారులంతా ఉద్రిక్తులయారు. స్పెషల్ ఇన్‌స్పెక్టరుగారు విసిగెత్తిపోయారు. అందరిదృష్టి రైతుకాంగ్రెసు నాయకునిపై పడింది. విజయం తనదేనన్నట్లు తన ఉపగ్రహాలతో చేరి, మంతనాలాడుతున్నారు. ఆపూట గంటన్నరయింది. రెండు పారాలు పూర్తిఅయాయి.

మరునాడు మునసబుగారు గుడివాడవెళ్ళి, "సుప్రసిద్ధ" కాంగ్రెసువాదిగా పేరుమోసిన శేషవరపు నరసింహారావుగారిని సలహా అడిగారు. ఇద్దరూ పెద్దబజారులో కలుసుకున్నారు. అప్పుడు నరసింహారావుగారిచ్చిన సలహా తెలుసాండి! అంతకీ ఇన్‌స్పెక్టరు అభ్యంతర పెడితే మన్నా రెవిన్యూ సర్టిఫికేట్లో రెండోవైపున, వంతకం దరఖాస్తుదారుది కాదనో, లేక మైనారిటీ వెళ్ళలేదనో రాయి — విన్ను బ్రహ్మదేవుడు కూడా కదల్చలేడు, అన్నారు! ఇంకేముంది! అసలే కోతి; అది నిప్పులు తొక్కిన సామెత అయింది!

మూడోరోజు వచ్చింది గుడివాడ కలెక్టరు ఆఫీసు అంతా నిండిపోయింది విమ్నజాతుల వారితో. కరణం మునసబుల తతంగాన్ని గురించి వారు కలెక్టరుకొక నివేదిక సమర్పించారు. రైతు కాంగ్రెసు నాయకునిముఠా అప్పుడేమి చేశారో తెలుసా! స్పెషల్ ఇన్‌స్పెక్టరు కమ్యూనిస్టు గనుక తమకు అన్యాయం జరుగుతోందని ఒకపిటీషనుతో తయారు! ఈరోజుల్లో కపట కాంగ్రెసువాదులు తమకు వ్యతిరేకంగా మాట్లాడిన ప్రతివానిని "కమ్యూనిస్టు" అనడం ఒక ఫేషన్ అయింది. దీనికి కలెక్టరు చెప్పిన జవాబు: "మీరు యీ విధముగా చేసుకుంటారని నాకు ముందే తెలుసు. అందుకనే స్పెషల్ పోస్టుకొరకు డి.ఎస్.పి.కి రాశాను." అంటూ, ఎంక్వైరీ కొరకు డిప్యూటీ తాహసీల్దారును పంపించారు.

నాల్గవరోజున కూలీలు రైతులు లైబ్రరీ వద్ద హాజరయారు. డిప్యూటీ తహసీల్దారు వస్తారని తెలిసి, కరణంమరొక 25 మందిని ఇండ్లు ఉన్నాయనే అర్హతకింద చేర్పించాడు. తహసీల్దారుగారు వచ్చారు. విమ్నజాతి ప్రజలు తమ గోడంతా ఆయనతో చెప్పుకున్నారు. అర్హత ఉన్నవారందరి లిస్టును తహసీల్దారు కందించారు. దాన్ని తహసీల్దారు కరణం చేతికి యిచ్చి, కొలతలు కొలుచుకురమ్మని ఉత్తరువు చేశాడు. కరణం వెళ్ళినట్లేవెళ్ళి, 8 మందికి మాత్రం అర్హతవుందన్నాడు! కూలీలందరికీ కడుపు మండింది. లైబ్రరీ అవరణ మళ్ళీ గొల్లుమంది. అప్పుడు తహసీల్దారు స్వయంగా పల్లెకు వెళ్ళి పరిశీలించారు. కాంగ్రెసువాదులు కొలతలవద్ద కూడా పేచీలు ప్రారంభించారు.

"మాలవాళ్ళందరికీ వోట్లువస్తే, అవన్నీ కమ్యూనిస్టుపార్టీకి పడతాయి గనుక యిలా చేయవలసి వచ్చిం"దంటూ రైతు కాంగ్రెసు ప్రముఖుడు మొన్ననే జైల్లోనుంచి విడుదలై వచ్చిన మరొక కాంగ్రెసువాదితో చెబుతున్నారు. అసలు రహస్యం యిదన్నమాట!

గాంధీజీ పేరుతో "హరిజనసేవ"అంటూ రొమ్ములు చరుచుకొని, ఉపన్యాసాలు దంచే కపట దేశభక్తుల కుటిలనీతి గ్రామస్థులకు బట్టబయలైంది. వీరి కుటిల ప్రయత్నాలు విఫలమయ్యాయి. అర్హత ఉన్న వారందరి పేర్లు ఓటర్లజాబితాలో చేర్పబడ్డాయి.

★ ★ ★

అభ్యుదయ కాముకులైన మహాపురుషుల్ని దేశమూ, ప్రజలూ గౌరవించాలి. గౌరవించుతారు కూడా. కాని, అడ్డదారిని కీర్తిసంపాదించుకుందా మనుకునేవాళ్లు ఇటువంటి గౌరవాలను తామే ఏర్పాటుచేసుకొని, మహాపురుషులై పోవడానికి ప్రయత్నిస్తారు!

ఇందుకు తార్కాణం పిఠాపురం మహారాజుగారి షష్టిపూర్తి. మహారాజుగారి అనుగ్రహాన్ని ఆపేక్షించే ఎస్టేటు ఉద్యోగులు యిందుకు సర్వ ప్రయత్నాలు చేస్తున్నారు. ఎవరైనా ఇతరులను బాధించనంతకాలం, వారి యిష్టం వచ్చినట్టు చేసుకోవచ్చు. ఎవరూ కాదనరు. కాని ఎస్టేటు ఉద్యోగులు ప్రజా పీడన ద్వారా, తమ ప్రభువును ఆరాధించడానికి నిశ్చయించుకున్నారు. రైతుల నుండి - కాస్తా కూస్తా కాదు - లక్ష ఏభైవేల రూపాయలు వసూలుచేసి రాజాగారిని పూజించడానికి తలపెట్టి రైతులమీద పడ్డారు. ఎస్టేటు గ్రామాల్లో విపరీతమైన ఆందోళన ప్రారంభమైంది. అసలేరైతులు పన్నుల భారంతో బాధపడుతున్నారు. చెరువు మరమ్మతులుచెయ్యమని ఎన్నిసార్లు ప్రాధేయపడినా ఎస్టేటువారు అనుగ్రహించరు. కాని యిప్పుడు తయారయ్యారు తమ ప్రతాపం ప్రపంచానికి చూపడానికి. చిత్రాడ, దుర్గాడ, మల్లవరం గ్రామాల్లో జరిగిన బహిరంగ సభల్లో యీ చర్య ఖండించబడింది. రైతు, చేనేతపారిశ్రామికసంఘాలు ఎస్టేటుగ్రామాల్లో యీ నిర్బంధపు వసూళ్ళకు వ్యతిరేకంగా ప్రచారం చేస్తున్నాయి. ఇంతేకాదు. ఈడబ్బు కాంగ్రెసు పేరుతో ఎస్టేటు ఉద్యోగులు వసూలు చేస్తున్నారు. పిఠాపురమంతా కాంగ్రెసు జెండాలతో అలంకరించబడింది. అవును మరి! యీ మధ్యేగదా తమయువరాజాగారు కాంగ్రెసు నలంకరించేరు!

పిఠాపురం యువరాజాగారు కాంగ్రెసులో చేరారని కళా వెంకట్రావుగారు అమలాపురంసభలో ఉబ్బి తబ్బిబ్బవడం చూదాం. ఈ పద్ధతిలో నడుస్తూన్న షష్టిపూర్తికి బులుసు సాంబమూర్తిగారు, బి.ఎస్. మూర్తిగారు, కొండా వెంకటప్పయ్యగారు మొదలైన హేమా హేమీలు బాకాలూదడం కూడా విన్నాం. పేదప్రజలను ఈతీరుగా పీడించేవారి చర్యలను ఖండించకపోవడమే కాకుండా, కాంగ్రెసువాదులు వారిసన్మానాలను సైతం ప్రచారంచేసి, కాంగ్రెసును ఎక్కడికి తీసుకుపోతున్నారో గమనించండి. ప్రజలకూ - కాంగ్రెసుకూ బద్ధశత్రువులైన జమీందార్లతో దోస్తీ చేసుకుంటున్నారు. ఇంతే కాదు. జమీందార్లు తమకెక్కడా తలెత్తుకునేటికి స్థానంలేదని తెలుసుకొని కాంగ్రెసులో చేరుతూంటే, కాంగ్రెసు నాయకులు బ్రహ్మానందం పొందుతున్నారు. యింకోవేపు ప్రజాసేవకులను కాంగ్రెసునుండి బయటకుతరిమివెయ్యడానికి ఉప్పునీచాలు చూడకుండా చెయ్యవలసినదంతా చేసేరు. ఇది ప్రజాసేవా! ప్రజాశత్రువులకు సేవా!

తెల్లారుపల్లి జాగీర్‌లో రైతుల అగచాట్లు

తెల్లారుపల్లి అనే జాగీరు ఖమ్మంకు (నైజాం) నాలుగు మైళ్ళ దూరంలో వుంది. ఇక్కడి జాగీర్‌దారు ప్రజల్ని పెట్టే యిబ్బందులు ఇన్నీ - అన్నీకావు. "కాటివమ్ము" అని, ఏవ్యక్తి అయినా చనిపోయినప్పుడు 0-6-6 చొప్పున వసూలు చేస్తారు. వివాహం జరగాలంటే, పిల్లను చేసుకున్నవారు మొట్టమొదట జాగీర్‌దారుకు రు 6-4-0 కట్నం చెల్లించుకోవాలి. లేదా, పిల్లతండ్రి అయినా చెల్లించాలి. రైతులు అనాదిగా సేద్యం చేసుకొంటూన్న భూములలో చెట్లు పెరిగితే, వాటిపై ఎట్టిహక్కూ ఉండదు. నిత్యావసరములైన వ్యవసాయపు పనిముట్లను సైతం జాగీరుదారు దగ్గరే విపరీత ధరలకు కొనుక్కోవాలి. వంటచెరకు తోలుకతెచ్చుకోవాలంటే, బండికి రు. 4-0-0, కూలీలైతే ఇంటికి 2-0-0. చెల్లించాలి. అది అయినా, సంవత్సరమునకు 12 మోపుల కంటే ఎక్కువ తెచ్చుకోడానికి వీల్లేదు. పొరబాటున ఎవరైనా ఒకకట్ట ఎక్కువగా తెచ్చుకుంటే, జాగీర్దారు నౌకర్లు ఇండ్లోజొరబడి, రు. 12 మొదలు రు.25 ల వరకు జరిమానావిధిస్తారు. కూలీలు ఎండా కాలంలో మోదుగుఆకులు కోసుకొని, అమ్మి జీవిస్తారు. అలా కోసుకొనుటకు మనిషి 1కి రు. 2-0-0 వసూలు చేస్తారు. లైసెన్సు చీటి తీసుకోకుండా ఎవరైనా కోస్తే, వెంటనే వారిని తీసుకుపోయి తమ యిష్టమైనంత జరిమానా విధిస్తారు. ఎన్ని రూపాయలు జరిమానా విధిస్తే, అన్ని బేడలు యీ కూలివానిని తీసుకువచ్చిన జవానుకు యిచ్చుకోవాలి. జాగీర్దారు గుర్రాలకు ప్రతిరైతు రెండుమోపుల జీలు, నూరు జొన్న కంకులు పంపుకోవాలి. ఇదిగాక, కోసి గూడు వేసినతరువాత గూడులోని పంటమోపులు రెండున్నూ, చొప్ప 100 కట్టలున్నూ జాగీర్దారుగారి దివాణమునకు పంపాలి. అలా పంపకపోతే, రు. 12 లు మొదలు రు. 25 వరకు జరిమానా విధిస్తారు. జాగీర్దారుకు మొత్తం 250 యకరాల సొంతశేరి ఉంది. ఇందులో 150 ఎకరముల మెట్టభూమిని వారి సొంతఆరకలతో దున్నుకుంటారు. తక్కిన 100 యకరముల మాగాణిని రైతులే దున్ని దుగమువేసి రావాలి.

జాగీర్ భూములను ఇంతవరకు బందోబస్తు చేయించలేదు. (సర్వే సెటిల్మెంటులు) శిస్తువిధానమనేది లేనేలేదు. యకరమునకింత అనిగాకుండా, వారియిష్టం వచ్చినంత పన్ను విధిస్తారు. జాగీరుదారు ఊరివెంట ఒక అంటు మామిడితోట వేయించారు. దానికి ఎవ్విధమైన బందోబస్తు చేయలేదు. రైతుల పశువులు ఖర్మం కాలక తోటలోపడితే, దివాణంలో కట్టివేయిస్తారు. రైతువెళ్ళి అడిగితే, విపరీతమైన మొత్తాలు చెల్లించమంటారు. రు. 80 వరకు అడిగిన సందర్భములున్నవి. రైతులనేకులు ఇచ్చుకోవలేక, తమ పశువుల్ని వదులుకొంటారు.

ఇట్టి దారుణ పరిస్థితులకు గురియై అణగిపోయివున్న రైతుల్ని ఖమ్మం ఆంధ్రమహాసభ ఉత్తేజపరిచింది. తమ కష్టాలను పోగొట్టుకొనేటందుకు గ్రామస్థులంతా ఆంధ్రమహాసభలో చేరనారంభించారు. జాగీర్‌దారు దీనితో క్రుద్ధుడై, గ్రామంలో ఉన్న తాగుబోతుల్ని ఒక ముఠాగా తయారుచేశాడు. అమాయకులైనరైతులమీద కేసులుపెట్టించి, కోర్టులచుట్టూ తిప్పుతున్నాడు. ప్రభుత్వం వెంటనే యీ జాగీర్దారు చేస్తున్న అక్రమాలను అరికట్టవలసిందని కోరుతున్నాము.

— జి. శ్రీనివాసరావు,
(ఆంధ్రమహాసభ కార్యదర్శి)

ప్రజాశక్తి

ఎన్నికలు : కమ్యూనిస్టుపార్టీ వైఖరి

కామ్రేడ్ సుందరయ్య ఉపన్యాసం

సెప్టెంబరు 30 వ తేదీ సాయంత్రం 7 గంటలకు బెజవాడ పట్టణ కమ్యూనిస్టు పార్టీ యాజమాన్యాన హనుమంతరాయ గ్రంథాలయంలో బహిరంగసభ జరిగింది. 1000 మందికి ప్రజలు హాజరయారు. పట్టణ పార్టీ కార్యదర్శి కామ్రేడ్ టి పోతరాజు అధ్యక్షత వహించారు. కామ్రేడ్ సుందరయ్యగారిలా ఉపన్యసించారు:

కాంగ్రెసు నాయకత్వం ప్రపంచంలో తమకు మిత్రులెవరో, శత్రువులెవరో కూడా గుర్తించలేకుండావున్నది. ద్వితీయ ప్రపంచ సంగ్రామ దారుణభీభత్సకాండనుంచి ఫాసిస్టు వ్యతిరేకమూర్తిగా, ప్రజానాయక దేశంగా, అలౌకిక దీప్తితో, వెలువడిన సోవియట్ రష్యాగాని, యూరోపు దేశాలలోరిపబ్లికన్ ప్రభుత్వాల స్థాపనకు దోహదంచేసిన ప్రజాస్వామ్య పిపాసగాని, నూతన సమైక్యచైనాగాని, బ్రిటిష్, అమెరికన్ లేబర్‌పార్టీలశక్తి ప్రతిభలుగాని - కాంగ్రెసు దృష్టి నేమాత్రం ఆకర్షించలేదు. వలసరాజ్యాధికార ప్రాబల్యావిత్తి సామ్రాజ్యదేశాల పీకులాట తప్ప వేరేమీ కాంగ్రెసు నాయకులకు గోచరించడంలేదు. మూడవ ప్రపంచ సంగ్రామాన్ని తీసుకువచ్చి, ప్రపంచంలోని ప్రజాస్వామిక శక్తులను కాలరాయడానికి ప్రయత్నిస్తున్న సామ్రాజ్యవాదులే వారి కండ్లకు కనిపిస్తున్నారు. శాన్ ఫ్రాన్సిస్కోలో మోలొటోవ్ ప్రకటనలేమి, లండన్‌లో ఇటీవల ఆయన చేసిన ప్రకటనలేమి కాంగ్రెసువారొక్కసారి తిలకిస్తారా? పారతంత్ర్య ప్రజాకోటికి స్వేచ్ఛను లభింపచేయడానికి సోవియట్ రష్యా సహాయం చేస్తుందని ఆ ప్రకటనలో స్పష్టం కావడంలేదా?

విదేశాలలో మన మిత్రులు

ఇంగ్లండులోను, ఇతర దేశాలలోను గల ట్రేడ్‌యూనియనులేమి, అమెరికా చైనాయేమి, సోవియట్ రష్యాయేమి, యూరోపులోని నూతన ప్రజాస్వామిక దేశాలేమి-మనకు ఆప్తమిత్రులు. ఈ నగ్నసత్యాన్ని మనం విస్మరించరాదు. ఇంగ్లండులోను ఇతరదేశాలలోనుగల కరడుగట్టిన సామ్రాజ్యవాదులే మన శత్రువులు. మన మిత్రులతో కలిసి, శత్రువులను తరిమివెయ్యడం మన విద్యుక్తధర్మం. దీనిని కాంగ్రెసు నాయకత్వం గుర్తించడంలేదు.

రష్యాను గురించిగాని, పరివర్తితమైన యూరోపును గురించిగాని, చైనాను గురించిగాని మాట్లాడడానికి వారికి ఒక్కమాటైనా తోచడంలేదు. వేవెల్ ప్రభృతులను మాత్రం విలువునా పొగిడివేస్తున్నారు.

అంతర్జాతీయ పరిస్థితులపరిణామజ్ఞానం యీ విధంగాకొరవడిన కారణంగా మననాయకులు దోషయుతమైన మార్గమవలంబిస్తున్నారు.

ఆగస్టు తీర్మానంలో పోరాట భాగం

ఆగస్టు తీర్మానం పరస్పర వైరుధ్యాలతో కూడుకొని ఉంది. ఫాసిస్టులపై మిత్రరాజ్యాలకు విజయం చేకూరాలని కాంగ్రెసు ఆశిస్తున్నట్లు తెల్పబడిన తీర్మానభాగం, పోరాటానికి సంబంధించిన చివరి భాగంచేత పూర్వపక్షం చేయబడుతుంది. పోరాటానికిసంబంధించిన ఆ తీర్మాన భాగం మాత్రం తప్పుడుదని ఆనాడు, నేడుకూడా కమ్యూనిస్టుపార్టీ చెబుతున్నది. అది కేవలం మన ప్రజల యోగక్షేమాలకే గాక, ప్రపంచ ప్రజాశ్రేయస్సుకే భంగకరమని మేము హెచ్చరించాము. పోరాట భాగాన్ని సాకుగా తీసుకొని కాంగ్రెసు ఫాసిస్టుసంస్థ అని అమెరీ ఘోషించగలిగాడు. దానిని నామరూపాలు లేకుండా చేసే నిమిత్తం దమన నీతిని అవలంబించగలిగాడు. సామ్రాజ్యవాదులకు పైచేయి లభించింది. మన నాయకులు కారాగారాలకు వెళ్ళారు.

రంగా ముఠా కాంగ్రెసు సోషలిస్టు పార్టీ, ఫార్వర్డు బ్లాకుల వారు జపాను అనుకూల ప్రచారం చేసి, విధ్వంసక చర్యలు కాంగ్రెసు కార్యక్రమమేనంటూ ప్రజల్ని పెడమార్గంలో పెట్టడానికి తోడ్పడినది కూడా యీ పోరాట భాగమే.

ఇన్నిసంవత్సరాలపాటు దేశంలో ప్రమాదభరిత పరిస్థితినెలకొనడానికేమి, సామ్రాజ్యవాదులపై సమైక్యతతో పోరాడలేక పోడానికేమి, కేంద్రంలో జాతీయ ప్రభుత్వాన్ని స్థాపించలేక పోడానికేమి, లంచగొండి ఉద్యోగులకు స్వైరవిహారావకాశాలను కల్పించడానికేమి, ఈతీర్మాన భాగమే కారణం. దొంగవ్యాపారస్తులు విజృంభించి ప్రజలను యమదేవత నోటకోయడానికి కూడా ఈతీర్మానభాగమే కారణం. జావా, ఇండో-చైనా, బర్మా మొదలైన చిన్న దేశాలు నేడు జాతీయ ప్రభుత్వాలను స్థాపించుకోగలుగుతున్నవి. కాని అఖండశక్తి, పలుకుబడి గల కాంగ్రెసు మాత్రం మనదేశాన్ని స్వాతంత్ర్యమార్గంలో ముందుకు నడిపించలేక పోయింది. నిజం చెప్పాలంటే ఈ తీర్మానభాగం ఫలితంగా, మన లక్ష్యసిద్ధికి మూడుసంవత్సరాలపాటు వాయిదా పడింది.

కాంగ్రెసునాయకత్వానికి నేడు జాతీయ సమైక్యతఅక్కరలేదు! అల్పసంఖ్యాకుల స్వయం నిర్ణయ హక్కును గుర్తించడంలేదు! లీగ్ నాయకులతో రాయబారాలు సహితం జరపడానికి నిరాకరిస్తున్నది కాని, మైత్రికి మాత్రం సహకారం కొరకు చేయినందిస్తున్నది. లీగ్‌నుఅణగద్రొక్కడానికి, సామ్రాజ్యవాదులను సంతుష్టి పెట్టడానికి కాంగ్రెసు నేడు ఉద్యుక్తమై వుంది.

1942 సంఘటనలతో కాంగ్రెసుకు ఏమీ సంబంధం లేదని గాంధీజీయే గాక, వర్కింగ్ కమిటీ సభ్యులుకూడా ప్రకటించి వున్నప్పటికి, 1942 ఉద్యమాన్ని కమ్యూనిస్టులు ద్రోహ బుద్ధితో ధ్వంసం చేశారని ఆరోపిస్తున్నారు కాంగ్రెసు నాయకులు. కారాగారంలో వుండగా ఒకమాట మాట్లాడారు. వెలుపలికి రాగానే వేరొకమాట మాట్లాడారు. తమతోపాటు కమ్యూనిస్టులుకూడా "రొంపి"లో దిగలేదని. ఇది మహాపరాధమని కాంగ్రెసు ఆరోపిస్తున్నది! ముస్లిముల న్యాయసమ్మతమైన స్వయంనిర్ణయ హక్కును బలపరచినందుకు, కాంగ్రెస్-లీగ్ సామరస్యానికై కృషిచేసినందుకు కమ్యూనిస్టులను తప్పుపట్టుకుంటున్నది. కాంగ్రెస్‌లోనాలుగణాలసభ్యులుగామాత్రంచేరి బందీలుగా వుండాలని కాంగ్రెసు నాయకత్వం కోరుచున్నది. అంతేగాదు - దేశంలో కమ్యూనిస్టుపార్టీని నామరూపాలు లేకుండా చేయడమే లక్ష్యంగా పెట్టుకున్నది.

ఏదేశంలోగాని, ఏ పార్టీకూడా దేశభక్తులతో కూడిన మరొక పార్టీని ఇంతవరకు నాశనం చేయలేకపోయింది. చైనా కమ్యూనిస్టులను నాశనంచేయగోరిన క్యూమింగ్‌టాంగ్ చివరకు కమ్యూనిస్టులతో కలసి పనిచేయక తప్పలేదు. లీగ్‌ను తుడిచిపెట్టాలనే కాంగ్రెసువాంఛ చిరకాలం మధుర స్వప్నంగానే వుండగలదు. ఇది రానున్న ఎన్నికలలో ధ్రువపడగలదు.

ముస్లింలీగ్ ఆశయం

ముస్లింలీగ్ ముస్లిం ప్రజాబాహుళ్య జాతీయాశయాలకు ప్రాతినిధ్యం వహిస్తున్నదనడంలో సందేహంలేదు. "ముస్లిం జాతులకు స్వయం నిర్ణయాధికారం ఉండాలి" అనే నినాదాన్ని లీగ్ అనుసరించినంతకాలం దాని పురోభివృద్ధినెవరూ ఆపలేరు.

కాంగ్రెసు నాయకత్వంలీగుపైన, కమ్యూనిస్టులపైన సంగ్రామం అని ఎ. ఐ. సి. సి. తీర్మానాలు స్పష్టం చేస్తున్నవి. అన్ని రకములయిన ప్రజా విరోధులను కాంగ్రెసు చేరదీస్తున్నది-జమీందార్లతో, భూస్వాములతో, దొంగవ్యాపారులతో చేయికలుపు తున్నది. పిఠాపురం యువరాజా, చల్లపల్లి రాజాలతో చేతులు కలుపుకున్నది. పంజాబులోకల్లా అభివృద్ధి నిరోధకులైన యూనియనిస్టులతో కలిసి లీగుపైన, కమ్యూనిస్టులపైన దాడిచేయ ప్రయత్నిస్తున్నది. క్రోధోన్మాదంతో.

భారతదేశ స్వాతంత్ర్య సిద్ధికి కాంగ్రెసు-లీగ్-కమ్యూనిస్టు సమైక్యతవిధిగాఉండితీరాలి ఇతర మార్గాలన్నీ మన లక్ష్యసిద్ధిని విలంబనం చేసేవే దేశంలో విభేదాలను పెంపొందింప చేసేవే!

సమైక్యతవుంటే స్వయం పరిపాలన నిస్తామని సామ్రాజ్యవాదులు చెబుతున్న సాకును బట్టబయలొనర్చాలనీ, ఐక్యతను సాధించుకుని, సామ్రాజ్యవాదుల ఆట కట్టించాలనీ, కాంగ్రెసు-లీగ్‌ఐక్యతద్వారా జాతీయ ప్రభుత్వాన్ని లాక్కోవాలనీ మూడుసంవత్సరాలుగా కమ్యూనిస్టులమైన మేము ప్రచారం సాగిస్తున్నాము 1942లో రహస్యవిధ్వంసక ఉద్యమ దౌష్ట్యాలనుంచి మేము దేశాన్ని కాపాడాము. ప్రపంచంలోని స్వేచ్ఛాప్రియులైన ప్రజలందరి ఫాసిస్టు వ్యతిరేకసంస్థగా కాంగ్రెసుప్రతిష్ఠను రక్షించాము. నాయకులుబయటకువచ్చి తమతప్పు దిద్దుకొని, సరియైన మార్గంలో స్వాతంత్ర్యంకోసం కృషిచేస్తారని ఆశించాం.

బ్లాక్ మార్కెటు దౌష్ట్యాలనుంచి ప్రజలను కాపాడాము. లంచగొండులయిన ఉద్యోగుల, దొంగవ్యాపారుల దుష్కృత్యాలనుంచి ప్రజలను రక్షించాము. దేశమంతటా ప్రజాసంస్థలను, స్వాతంత్ర్యోద్యమంలో పాల్గొనడానికి సిద్ధమైన వాటిని ఎన్నోనెలకొల్పాము.

మిగతా పార్టీలన్నిటినీ తుడిచివేయాలని కాంగ్రెసు నాయకులు నేడు కోరుతున్నారు. భారత స్వాతంత్ర్యాన్ని తాము మాత్రమే సంపాదించగలమనుకుంటున్నారు. వివిధ పక్షాల అంగీకారం ద్వారా గాక, బలాత్కారంగా సమైక్య భారతదేశాన్ని సృష్టించాలని కాంగ్రెసు కోరుతున్నది. మేము కూడా సమైక్యభారతదేశాన్నే కోరుతున్నాము-కాని వివిధ పక్షాల పరస్పరాంగీకారంద్వారా, ఇచ్ఛాపూర్వకంగా, అది సిద్ధించాలంటున్నాము.

కమ్యూనిస్టుపార్టీ అనుకూలం ప్రవర్తమానమవుతున్నదంటే, అందుకు దాని విధాన విశిష్టతయే కారణం. మా విధానాన్ని మేము ఏకదీక్షతో, పట్టుదలతో సాగిస్తాము.

మా లక్ష్యం

దేశభక్తపక్షాలను, ముఖ్యంగా కాంగ్రెసు, లీగ్, కమ్యూనిస్టు పక్షాలను ఏకోన్ముఖంచేసి, బ్రిటిష్ సామ్రాజ్యవాదంపై పోరాడటమే మా లక్ష్యం. కాంగ్రెసు అనుసరిస్తున్న లీగ్ వ్యతిరేక విధానం దేశక్షేమానికి ప్రతికూలం. సమైక్యతావశ్యకతను దేశమంతటాచాటి, కాంగ్రెసు నాయకత్వం తన పాలసీని, విధానాన్ని విడనాడేటట్లు చేస్తాము.

సమైక్యతాసిద్ధికి నేడు సంపూర్ణ కృషి చేస్తున్న పక్షం కమ్యూనిస్టుపార్టీ ఒక్కటే. కాంగ్రెసుకు, లీగుకు కమ్యూనిస్టుపార్టీ వారధి వంటిది. దీనిని శక్తివంతం చేయకపోతే భవిష్యత్తులో జాతీయైక్యత సిద్ధించదు.

ఈ జాతీయ అంతర్జాతీయ పరిస్థితులన్నిటిని దృష్టిలో వుంచుకునే, కమ్యూనిస్టు పార్టీ ఎన్నికలలో పాల్గొనడానికి నిర్ణయించింది. మేము కాంగ్రెసును బలహీనం చేయడానికి ఎన్నికలలో పాల్గొంటున్నామని మా ప్రతికక్షులు అంటున్నారుగాని, కాంగ్రెసును బలహీనంచేయడానికి మేము పనిచేయడం లేదు. మావిధానాన్ని, కార్యక్రమాన్ని ఎన్ని లక్షలమంది బలపరుస్తున్నారో కాంగ్రెసుపెద్దలకు తెలియజేయడానికే ఎన్నికలలో పాల్గొంటున్నాము.

ప్రజలు కాంగ్రెసు, లీగ్, కమ్యూనిస్టు ఐక్యతను వాంఛిస్తున్నారు. ప్రజల యీ అభీష్టాన్ని చాటడానికే మేము ఎన్నికలలో పోటీచేస్తున్నాము. కమ్యూనిస్టు అభ్యర్థులను బలపరచడమంటే, ఐక్యతాశక్తిని పెంపొందింపచేయడమన్నమాట. ఎన్నికలలో ఎంత ఎక్కువగా కమ్యూనిస్టులు నెగ్గితే, కాంగ్రెసు, లీగులు అంత త్వరగా ఐక్యతకు వస్తవి. ఈ అభిప్రాయంతోనే మేము ఎన్నికలలో పాల్గొంటున్నాము.

దేశభక్తిపరిపూరితులైన ప్రజలు మమ్ములను బలపరచి, కాంగ్రెసు నాయకత్వం ప్రస్తుతం అవలంబిస్తూన్న ఐక్యతా వ్యతిరేక విధానాన్ని ఎదుర్కొన గలరని విశ్వసిస్తున్నాము. నేడు కమ్యూనిస్టు, లీగ్ అభ్యర్థులకు వ్యతిరేకంగా కాంగ్రెసుకు ఇచ్చే ప్రతి ఓటు లీగును, కమ్యూనిస్టులను నాశనంచేయజూచే కాంగ్రెసులోని అభివృద్ధి నిరోధక వర్గాలను బలపరుస్తుంది. కమ్యూనిస్టు అభ్యర్థిగాని, లీగు అభ్యర్థిగాని లేనిచోట్ల జస్టిస్‌పార్టీ వంటి అభివృద్ధి నిరోధకపార్టీలకు వ్యతిరేకంగా కాంగ్రెసు అభ్యర్థిని మేము బలపరుస్తాం. కమ్యూనిస్టులకు ఇచ్చిన ప్రతి వోటు వివిధపక్ష ఐక్యతకు, స్వయంనిర్ణయ సూత్రాంగీకారానికి, సామ్రాజ్యవాదంపై సమరానికి వోటుకాగలదు.

కాంగ్రెసులోనుంచి రాజీనామా నిస్తున్నాం

(మొదటి పేజీ తరువాయి) గురించి కామంతగా గొంతు చించుకోనవసిన అవసరమే ఉండేది కాదనీ - వీరి బుద్ధికి తట్టడంలేదు.

గత మూడేళ్ళలో కొందరు బాహాటంగా జపాను అనుకూల ప్రచారం చేశారు; మరి కొందరు విధ్వంసక కార్యక్రమాన్ని కొనసాగించారు. దేశభక్తితోనే ఇదంతా చేశారని కాంగ్రెసు నాయకులు వారిని సమర్థించారు. కొందరికి స్తోత్రపాఠాలు పాడారు; మరికొందరిపై తీర్పుచెప్ప నిరాకరించారు. వారిపట్ల ఇంత ఆదరణచూపిన ఈనాయకులే మావిషయంలో ఎలా ప్రవర్తించారు? మాకు కూడా దేశభక్తి ఉండవచ్చుననీ, మా ఉద్దేశాలుకూడా దేశభక్తి పూరితములే కావచ్చుననే సందేహమైనా వారికి తట్టకపోయింది. ఈ దృష్టితో మమ్మల్ని పరిశీలించ నిరాకరించింది కాంగ్రెసు నాయకవర్గం. ప్రపంచంలోని అభివృద్ధి నిరోధకశక్తులు తమ తమ దేశాల్లో కమ్యూనిస్టులమీద ఏ ఆరోపణలయితే చేస్తున్నారో, ఆ ఆరోపణలనే మాపైని కూడా చేశారు కాంగ్రెసు నాయకులు. ఫాసిస్టు వ్యతిరేక ప్రచారం అనే పేరుతో రష్యా లాభం కొరకే మేము కృషి చేస్తున్నామట! దేశరక్షణను భగ్నంచేసే విధ్వంసక కార్యక్రమాన్ని మేము ప్రతిఘటించింది బ్రిటిష్‌వారి యుద్ధప్రయత్నాలను బలపర్చడం కోసమేనట!

దుష్ఫలితాలు

పరస్పర వైరుధ్యాలతో కూడుకున్న 1942 ఆగస్టు తీర్మానం జాతీయప్రభుత్వాన్ని తెచ్చిపెట్టలేదు సరికదా, కనీవిని ఎరుగని అవమానాలను వర్షంగా కురిపించింది. ఈవిషయాన్ని గుర్తించ నిరాకరిస్తున్నారు కాంగ్రెసు నాయకులు. అవివానం ఫలించకపోవడానికి కారణం మేమే అని పాటకచెప్పి, మా మీద తమ అక్కసునంతా వెళ్ళగక్కుతున్నారు. మా పార్టీ పట్ల ఈ గుడ్డిద్వేషం అప్పుడే మూడు దుష్ఫలితాలకు దారితీసింది.

ఒకటి - ఇతర దేశాల్లోని మన మిత్రులు దిగ్భ్రాంతి చెందారు. ఎందువల్ల? ఈనాడు ప్రపంచంలో స్వాతంత్ర్యాన్ని, ప్రజాస్వామ్యాన్ని సుస్థిరంగా నెలకొల్పుతూన్న శక్తుల్లో ప్రపంచ కమ్యూనిస్టు ఉద్యమం అన్నిటికన్నా బలమైనది. కాంగ్రెసు నాయకవర్గం దాని మీదనే దాడి ప్రారంభించారు.

రెండవది — కాంగ్రెసు మహాసంస్థలో ఫాసిస్టు, అభివృద్ధినిరోధక శక్తులూ, వియంతృత్వ ధోరణులూ పడగలెత్తసారంభించాయి. అధికారం కోసం పెనగులాటా, ముఠాలు కట్టడం ప్రారంభమయింది. ఈ కుళ్ళంతా కప్పిపుచ్చడానికి కమ్యూనిస్టు వ్యతిరేకతను ఉపయోగిస్తున్నారు.

మూడవదుష్ఫలితం - సాధారణ కాంగ్రెసు సభ్యుల్లో అయోమయావస్థ అలముకుంది.

కాంగ్రెసు నాయకులు తమ వెనకటి విధానాన్ని ఆత్మవిమర్శక దృష్టితో పరిశీలించి, నేటి పరిస్థితుల కనుగుణ్యమైన నూతన విధానాన్ని సూచించి, కాంగ్రెసులోని ఇతర గ్రూపులన్నీ దానిని నిష్పక్షపాత దృష్టితో పరిశీలించి, తగు సలహాలివ్వమని కోరడం సరియయిన మార్గం కాని, అలా చేయక, ఈ నాయకవర్గం మా పార్టీవారికి తాళంవేయ జూస్తూంది. మాపార్టీవారు సాధారణ సభ్యులుగా ఉండవచ్చునుగాని, విశ్వయాధికారాలుగల పంఘాలకూ, బాధ్యతగల పదవులకు ఎన్నుకొండకూడదనీ వారు చేసిన తీర్మానంయొక్క భావం.

ఈ విషయంలో కాంగ్రెసు నాయకులు బ్రిటిష్ లేబరుపార్టీయొక్క అభివృద్ధి నిరోధక మార్గాన్ని అక్షరాల అనుకరిస్తున్నారు. లేబరుపార్టీ కార్యనిర్వాహకవర్గాల్లో కమ్యూనిస్టులుండగూడదని ఆ నాయకవర్గం ఒక నీచమయిన నిర్ణయం చేసింది. ఈనాడు కాంగ్రెసు నాయకులుకూడా అల్లాంటి విధానాన్నే అనుసరిస్తున్నారు. కాంగ్రెసు సభ్యుల్లోనే ఈనాయకులకు నమ్మకంలేకుండా పోయింది! జాతీయసంస్థలో ఒక భాగంగా ఉన్నవారికే సామాన్యప్రజాస్వామిక హక్కులను నిరాకరిస్తున్నారీ నాయకులు!

అంతటితో ఆగలేదు. పోటీసంఘాలకు ప్రోత్సాహం ఇస్తున్నారు. విద్యార్థి, రైతు, కార్మికరంగాల్లో చీలికలుతెచ్చి పోటీసంఘాలు పెట్టడానికి ప్రయత్నిస్తున్నవారికి మద్దతునిస్తున్నారు. ఈ ప్రయత్నాలు చేస్తున్నవారెవరు? దొంగవర్తకుల, లంచగొండుల ఏజంట్లు. లేదా కార్మిక కర్షక నాయకులుగా ఒకప్పుడు వెలిసి తరువాత, నిజస్వరూపాలుబయటపడగా, పెను కటి ప్రతిష్ఠను కోల్పోయి, తిరిగి ఈనాడు కాంగ్రెసు బురఖాతో చెలామణీ కావడానికి తంటాలు పడుతున్న మనులు.

కాంగ్రెసు లీగు విభేదాలు పెచ్చుపెరిగిపోతూంటే మాపార్టీ చూస్తూ కూర్చోదు; ఒకదానికి వ్యతిరేకంగా మరొకదాన్ని బలపరచి, అంతర్యుద్ధాన్ని రెచ్చగొట్టదు. స్వాతంత్ర్య సాధనకొరకు ఈ రెండింటి ఐక్యతకమత్యాన్ని కుదర్చడానికి మాపార్టీ తన శక్తి నంతటినీ వినియోగిస్తుంది. ఎడతెగకుండా విషప్రచారం జరుగుతూంటే వింటూ కూర్చోదు. స్వాతంత్ర్యోద్యమ నావను నట్టేట ముంచబోతూన్న నాయకవర్గంయొక్క నిర్బంధాలకు, నిషేధాలకు తలఒగ్గి మా పార్టీ కూర్చోదు!

పదవీఅన్వేషణమే వృత్తిగా పెట్టుకొన్న పెద్దమనుష్యులు వచ్చి ఉజ్వలమైన రైతు, కార్మిక ఉద్యమాలను విచ్ఛిన్నం చేయకుండా మా పార్టీ కాపాడుతుంది. మా యువక జీవితాన్నంతా ధారపోసి ఈ ఉద్యమాలను నిర్మించాం! ఈ రైతుసంఘాలు, ఈ కార్మిక సంఘాలు హిందూ, ముస్లిం ప్రజల సంఘ భవిష్యత్ ప్రజాస్వామిక వ్యవస్థకు పట్టుగొమ్మలు. వాటిని విచ్ఛిన్నం కానివ్వం. ముమ్మాటికీ కానివ్వం!!

మా నిర్ణయము

కాంగ్రెసు నాయకవర్గం ప్రస్తుతం అనుసరిస్తున్న లీగు వ్యతిరేక, కమ్యూనిస్టు వ్యతిరేకపంథా అంతర్యుద్ధాన్ని, వర్గ పోరాటాన్ని ప్రేరేపిస్తుందనీ; దేశాన్ని అధోగతి పాల్జేస్తుందేగాని, స్వాతంత్ర్యానికి దారితీయదనీ కమ్యూనిస్టులం భావిస్తున్నాం.

ఇలాంటి విధానాన్ని కొనసాగించడానికి బదులు, దానిపట్ల మా వ్యతిరేకతను సుస్పష్టం చేయడమే మా ప్రధాన కర్తవ్యంగా గణిస్తున్నాం. కాబట్టి, మా పార్టీ సభ్యుల నందరినీ కాంగ్రెసు సభ్యత్వానికి రాజీనామా నివ్వవలసిందని ఆదేశిస్తున్నాం. ఎ. ఐ. సి. సి.లోని కమ్యూనిస్టు సభ్యులుమాత్రం ఇప్పుడు రాజీనామా నివ్వరు. మాపార్టీపై వర్కింగు కమిటీ తెచ్చిన అభియోగాలకు వారు జవాబు చెబుతారు. వర్కింగుకమిటీ యొక్క తీర్పుకొరకు నిరీక్షించుతారు. గడచిపోయిన విషయాలను గురించి వర్కింగు కమిటీ అభిప్రాయాలను తెలుసుకోవడం ముఖ్యం. మన జాతీయోద్యమంయొక్క భవిష్యత్తులో వాటికి ప్రధానస్థానముంది.

ఈ విషయానికి సంబంధించిన పత్రాలన్నీ మరో పదిహేను రోజుల్లో బయటపడతాయి. వాటిపై ప్రజలే తీర్పుచెప్పగలరు. ప్రస్తుత పరిస్థితుల్లో మేము తీసుకున్న నిర్ణయమే కాంగ్రెసుకీ, మాకూ కూడా శ్రేయోదాయకమని చిత్తశుద్ధిగల కాంగ్రెసువాదులందరూ గుర్తిస్తారని నమ్ముతున్నాం. స్వేచ్ఛగా మా పాలసీని కాంగ్రెసువారి ఎదుట, ప్రజల ఎదుట పెట్టగల అవకాశం ఈ నిర్ణయంవల్ల మాకు కలుగుతుంది. మూడేళ్ళ అజ్ఞాతవాసం తరువాత కాంగ్రెసుసంస్థకు దానెక్కడున్నది గుర్తించుకోగల అవకాశం ఇందువల్ల కలుగుతూంది. "అన్నదమ్ములమధ్య కత్తులు దూసుకోవడం స్వాతంత్ర్య సాధనకు మార్గం ఎలా కాగలదు?" అని కాంగ్రెసు సాధారణ సభ్యులు తమ నాయకులను అడగకుండా ఎంతకాలం పడిఉండగలరు?

భారతప్రజల 'జాతీయైక్య సంఘటనకు' కాంగ్రెసు మహాసంస్థ పునాది కాగలదని మేమూ, ఇతర అభ్యుదయ కాముకులూ కలలు కన్నాం. ఈనాడు కాంగ్రెసు నాయకవర్గం బుద్ధిపూర్వకంగా లీగు వ్యతిరేక, కమ్యూనిస్టు వ్యతిరేక పంథాననుసరించడంవల్ల ఈ కలలన్నీ కల్లలవుతున్నాయి.

> మనదేశం బానిసబంధాల్లో మ్రగ్గుతూన్నంతకాలం దేశంలోని అభివృద్ధికర శక్తులన్నిటియొక్క ఐక్యసంఘటన తప్ప స్వాతంత్ర్య సాధనకు మరో మార్గంలేదు.

ఐక్యతా సాధనకు

చాల గడ్డుదినాలు మన ముందున్నాయి. ఎలాంటి విషమపరిస్థిల్లోనయినా సరే, విరామం లేకుండా కాంగ్రెసు - లీగు; కాంగ్రెసు, కమ్యూనిస్టు ఐక్యతను సాధించడానికే కృషి చేస్తాము. కాంగ్రెసు, లీగు, కమ్యూనిస్టు పార్టీలు ఏకముఖంగా స్వాతంత్ర్య సాధనకు పోరాడేలా చేయడానికే పాటుపడతాం!

కాంగ్రెసు, లీగు సోదరుల్లో ఉన్న దేశభక్తిపై పూర్తి విశ్వాసం ఉంచే మేమీ ఐకమత్యాన్ని సాధించడానికి నడుం బిగిస్తున్నాం. ఒక పక్షంయొక్క దృక్పథంలో ఉన్న న్యాయాన్ని రెండో పక్షానికి విశదం చేయడం ద్వారా; న్యాయ సమ్మతంకాని కోర్కెలను ఏ పక్షం కోరినాసరే ప్రతిఘటించుటద్వారా, మా కర్తవ్య నిర్వహణకు పూనుకుంటాం.

> జనసామాన్యం తన వివక్షతా జ్ఞానాన్ని ఉపయోగించి విచ్ఛిన్న కారులను ఎదుర్కోమని ప్రార్థిస్తాం. సఖ్యాన్ని వెల్లడిచేసే విష ప్రచారాలను అరికడతాం.

దేశభక్తిని ఎదుర్కొడ్డి అపోహలను తొలగచేస్తాం.

లీగుతో కాంగ్రెసు, కాంగ్రెసుతో లీగు, లేక కాంగ్రెసు - లీగులు కమ్యూనిస్టులతో ఎంతగా పోరాడుతాయో అంతగా బ్రిటిష్ సామ్రాజ్యవాదపు ఉక్కుడు మనందరి మెడలకు బిగుసుకుంటుందన్న విషయాన్ని లీగు, కాంగ్రెసు సోదరులు గుర్తించిననాడు మా పాలసీ సరియయినదని రుజువవుతుంది.

విజయం తప్పదు!

ఈనాడు మాది ఏటికెదురీత కావచ్చు. కాని పరిస్థితులు సుగమం కాగలవనే ధైర్యం మాకుంది.

ఆవేశం ప్రకోపించి హేతుజ్ఞానాన్ని ఎంతకాలం అణచిపెట్టగలదు? పక్షపాతం పొంగిపొరలి ఎంతకాలం దేశభక్తికి స్థానంలేకుండా చేయగలదు?

తలాకదారై ఎంతకాలం పరాయిప్రభుత్వం క్రిందపడిఉండగలం?

ఈనాటి మా ఉద్బోధను, రేపు అందరూ తమ అనుభవంమీదనే గుర్తిస్తారు! దేశస్థుల నందరినీ ఒకేవిధంగా కట్టిపడేస్తున్న బానిసబంధాలను తెంచి, అందరి స్వాతంత్ర్యాన్ని సాధించగల జాతీయైక్య సంఘటన కోసమే ఇంతవరకు కృషిచేశాం - ఇప్పుడూ చేస్తున్నాం - ఇకముందు కూడా చేస్తాం! భారత ప్రజలందరికీ స్వాతంత్ర్యాభివృద్ధులను చేకూర్చగల ఉద్యమమిది. దీనిలో ఓటమికి అవకాశం లేదు. ముమ్మాటికి విజయం సాధిస్తాం!

సవరణలు

26-9-45వ తేదీ సంచికలో "ప్రజాశక్తి" దినపత్రిక నిధికి కానుమూరి సత్యనారాయణ రెడ్డిగారు (ఎర్రగుంటపల్లి) రు. 200 లు యిచ్చినట్లు పడింది. అది పొరబాటు. ఇచ్చిన వారి పేరు కాకుమాడి సత్యనారాయణరెడ్డి గారు.

★

3-10-45 ప్రజాశక్తి 7 వ పేజీ 2 వ కాలంలో - కృష్ణా జిల్లా పెదన గ్రామంలో గ్రామ చేనేత సంఘం ఒకటుంది. అక్కడి నూలు వర్తకులు బెజవాడ ఎంపోరియం నుంచి నూలును కొనితెచ్చి, స్థానిక చేనేత పారిశ్రామికులకు అమ్ముతున్నారు. అలా అమ్మడంలో నెం 40 నూలుకు గాని నెం. 60 నూలుకుగాని, పెట్టె 1కి రు. 20లు వరకు అదనంగా వసూలు చేస్తున్నారు. అని వున్నది. అది పొరపాటు. గ్రామ సంఘము వారే బెజవాడ ఎంపోరియంనుంచి నూలును కొనితెచ్చి, స్థానిక పారిశ్రామికులకు అమ్ముతున్నారు. నెం. 40 దళ్లిపెట్టె 1కి రు. 18-6-0 కంట్రోలు రేటు అయితే (ఖర్చులతోసహా) రు. 20 లు వసూలుచేస్తున్నారు. నెం. 60 రు పెట్టె 1కి రు. 19-6-0 అయితే దానికి కూడ రు. 20లు వసూలు చేస్తున్నారు. అదనంగా రు. 20 కాదు.

గుంటూరుజిల్లా వ్యవసాయకూలీ సంఘం

రైతు - కూలీ సామరస్యంకొరకు పోరాటం

గుంటూరు జిల్లా వ్యవసాయకూలీసంఘ కార్యకర్తల సమావేశం సెప్టెంబరు 17, 18 తేదీలలో తెనాలిలో జరిగింది. జిల్లా అంతటిలోను బాగా బలపడ్డ తెనాలి, రేపల్లె తాలూకాలనుంచే గాకుండా, ఇప్పుడిప్పుడే ఉద్యమం బయలుదేరిన నరసారావుపేట, ఒంగోలు తాలూకాలనుంచి కూడా ప్రతినిధులు వచ్చారు. మొత్తం 42 మంది ప్రతినిధులు హాజరయారు. కొత్తిగా ఉద్యమం ప్రాకని పల్నాడు, వినుకొండ తాలూకాలనుంచి తప్ప మిగతా అన్ని తాలూకాలనుంచి వ్యవసాయ కూలీ నాయకులు సమావేశాని కొచ్చారు. కామ్రేడ్ కాటోకు రామస్వామి అధ్యక్షత వహించారు. ఆయా ప్రాంతాల రిపోర్టులెన్నీ ఎక్కువభాగం కూలీలే యిచ్చారు. ఏకొద్దిమందో రైతుయువకులుమాత్రం ఉద్యమాన్ని గురించి రిపోర్టులిచ్చారు. కూలీలే కూలీ సమస్యలను గురించి వివరంగా, కపట మెరుగని మాటల్లో బంగు బంగని మాట్లాడుతూవుంటే, వింటానికి ఎంతో ఉత్సాహమిగ్గు వుంది. నరసారావుపేటనుంచి వచ్చిన కామ్రేడ్ మస్తాను ఆ తాలూకా పరిస్థితులను గురించి చెప్పేటప్పుడు, తూములూరు గ్రామ పెత్తందార్లు పల్లెలో కట్టిన ఎర్రజండా తీసివేయమన్నప్పుడు, ఎర్రజండా తన జండా అని, సుత్తికొడవలి కార్మిక కర్షక చిహ్నమని, ఎరుపురంగు తన రక్తచిహ్నమని నిగ్గుదేరిన కార్మిక చైతన్యంతో సమాధానమిచ్చిన విషయాన్ని గురించి తూములూరు ప్రతినిధి చెప్పేటప్పుడు సమావేశంలో ఉత్సాహం పొంగి పొర్లింది. వ్యవసాయ కూలీల వేర్వేరు విషయాలమీద యీ దిగువ రిపోర్టులిచ్చారు. ఈ విజయాలవల్ల గుంటూరుజిల్లా రాజకీయాలలో ఒక నూతన శకం ఆరంభమైందని చెప్పవచ్చు.

7 తాలూకాల్లో 110 గ్రామాల్లో ఈనాడు మన సభ్యత్వముంది. 6 వేలకుపైగా సభ్యులు చేరారు. వ్యవసాయకూలీ ఉద్యమ ప్రారంభంలో రైతుయువకులే పుద్యమవ్యాప్తికి పాటుపడుతూవచ్చారు. కాని ఈనాడు వ్యవసాయ కూలీ పుద్యమం ద్వారా ఎన్నో పోరాటాల్లో ఆరితేరిన కూలీలే అర్గనైజర్లుగా తయారయ్యారు. మారుమూలలవున్న పల్లెల్లోకూడా మన పుద్యమం చొచ్చుకుపోతోంది. తరతరాలుగా అంధకారములో వున్న వ్యవసాయ కూలీలకు సంఘం ఆకాజ్యోతిగా తయారయింది.

రైతు - కూలీ సామరస్యం

మొదట్లో వ్యవసాయకూలి ఉద్యమాన్ని చూచి విముఖతవున్న రైతాంగం మన ఉద్యమం బలపడినకొద్దీ, దాన్ని అర్థంచేసుకొని దగ్గరకు వస్తున్నారు. కఠెవరంలో స్వార్థపరులైన పెద్ద రైతులు వాములు తగులబెట్టి కూలీలే తగులపెట్టారని కూలీలమీద మూడు తప్పుడుకేసులు పెట్టటం, అన్ని తరగతులకు చెందిన మిగతా రైతాంగం వుత్తరసాక్షులుగా రావటం, దాని ఫలితంగా రెండు కేసులు కొట్టివేయబడటం. గుంటూరు తాలూకా నేలపాడులో రైతు కూలీ ప్రతినిధుల సమావేశమయి పనిచేసే గంటలను, కూలిరేటును సక్రమంగా నిర్ణయించుకొని అమలుపరచుకోవటం, దావులూరులో బ్రాహ్మణులు సైతం హరిజనులదగ్గర బుర్రకథల దగ్గర అన్ని వ్యవహారాల్లో కలసిమెలసి, కూలీ ఉద్యమంతో పెనవేసుకు పోవడం - ఇదంతా వ్యవసాయకూలీవుద్యమంఏవిధంగా వురకలెత్తుతూ ముందుకు పోతుందో స్పష్టపరుస్తుంది. ఇదే విధంగా వ్యవసాయకూలీలు తెనాలిలో జరిగిన రైతుమహాసభను తమ సభగాఎంచి, మొదట నుంచి చివరవరకు రైతాంగానికి తోడ్పడటం; దావులూరు కూలీలు 30 టన్నుల తుమ్మ కర్రమకొట్టి బండ్ల మీద తోలుకురావటం, మహాసభలో రైతు కూలీ విభేదాలు మరచి ఒకే కుటుంబం మాదిరిగా 50 వేల రైతు కూలీలు పాల్గొనటం, ఒకే పంక్తిని రైతు కూలీలు భోజనాలు చెయ్యడం - ఇదంతా చూస్తే రైతు - కూలీ సామరస్యం ఎంత ముందుకు పోయిందో, మన సోదర భావం ఎంత గాఢమయిందో బోధపడుతుంది.

ఇదే సందర్భంలో చౌకబారు నినాదాల్తో బయలుదేరిన నాయకమ్మన్యులు, ఉపనిషత్తుల రాజ్యం తేవాలని ఉబలాటపడే అభివృద్ధి నిరోధకులు, పోటీగా గోవాడలో రైతుమహాసభను పెట్టటం, వచ్చిన పదివేల ప్రజల్ని

మా విలేఖరి

కులాలవారీగా విడదీసి వేరువేరు పంక్తులలో భోజనాలు పెట్టడం, ముంతలతో నీళ్ళుపోయడం - ఇదంతా ఎంత సిగ్గుచేటో, కాంగ్రెసు పేరుతో సంఘాన్ని ఎంత అధోగతికి తీసుకుపోతున్నారో, సోదర ప్రజలమధ్య విభేదాలను ఎంత రెచ్చగొట్టుతున్నారో కనపడుతుంది.

పోయిన కార్తీక మాసంలో కూలీలు తిండికి కటకటలాడుతూండే రోజుల్లో రైతులు జిల్లా మొత్తంమీద 900 బస్తాలు ధాన్యం కంట్రోలు రేటుకు కొలిచారంటేను, చోడాయపాలెం, బెల్లంవారిపాలెం, క్రాప, కంచర్లపాలెం, అమృతలూరు, దావులూరుగ్రామాల్లో నాముపద్ధతిని నాశనంచేసి, రైతాంగం కూలీలకు తోడ్పడ్డారంటేను రైతు కూలీ సామరస్యం ఎంత పెంపొందినదీ, రైతాంగం కూలీలకు ఎంతదగ్గరకు వస్తున్నదీ తెలుస్తున్నది.

కూలీలలో ఉద్యమ ప్రభావం

కొల్లూరు కూలీల్లో కొందరు చుట్టుపట్ల గ్రామాల్లో కూడా కొందరు, దొంగతనంగా గొడ్లను కోయటం, చర్మం వొలుచుక పోవటం అదివరకు ఉండేది. అక్కడ వ్యవసాయ కూలీ వుద్యమం బయలుదేరిన తర్వాత యీ ఘోరం పూర్తిగా అంతరించింది. దానితో చుట్టు ప్రక్కల గ్రామాల రైతులందరు 'కూలీ వుద్యమం' అంటే ఏమిటో గుర్తించ గలిగారు. బ్రాహ్మణ కోడూరులాంటి చోట్ల గడ్డి జనపకట్టెల దొంగతనాలు పూర్తిగా అరికట్టబడ్డాయి. కూలీలలో వచ్చిన యీ మార్పు ఫలితంగా, కఠెవరం మొదలగు అనేక గ్రామాల్లో రైతులు కూలీలచేత వెట్టి చాకిరిలు చేయించుకోవడం మానుకున్నారు. పరిస్థితుల ననుసరించి చాలాచోట్ల రైతులే స్వయంగా కూలి రేటు పెంచారు. కఠెవరం, జూపూడి, మాదల, తుమ్మూరు, మొదలగు కొన్ని గ్రామాల్లో కూలీలే ఆందోళన చేసి ఎక్కువ కూలిని సంపాదించుకొన్నారు. మెట్ట తాలూకాల్లో అనేక గ్రామాల్లో కంట్రోలు రేటుకు బియ్యపు డిపోలు పెట్టించి, ఆహార సమస్యను పరిష్కరించడం జరిగింది. ఉప్పుగుండూరు మొదలగు గ్రామాల్లో బ్లాకు మార్కెట్టు నరికట్టి, వివిధ వస్తువులు కంట్రోలు రేటుకు అందించడం వల్ల చుట్టు ప్రక్కల గ్రామాలలో ఎంతో సానుభూతి వచ్చింది. జాగర్లమూడి, దావులూరు మొదలైన డెల్టా గ్రామాల్లో కూడా బియ్యం, 2 మానికలలో అరసోల, సోల తగ్గించి అమ్ముతుంటే, సంఘం తరఫున సరిగా 2 మానికల చొప్పున అమ్మించడం జరిగింది.

కొల్లిపర వ్యవసాయ కూలీ అర్గనైజరు కామ్రేడ్ ఏసుదాసు చుట్టుప్రక్కల గ్రామాలలోని రైతులకు, కూలీలకు గూడా తలలో నాలుకగా మెలగుతూ రాజకీయాలు చక్కగా వివరించిచెపుతూవుంటాడు. కిరసనాయిలు పంపకంలో నేమి, మందులిప్పించడంలో నేమి తనకోటి కూలీలకు ఎప్పుడూ ఏ సమస్య వచ్చినా తన సమస్యగానే భావించి చేతులోపని వదిలిపెట్టి పరుగెత్తుతూవుంటాడు. దావులూరులో కామ్రేడ్ చింతల సూర్యనారాయణ, కామ్రేడ్ కాటోకు రామస్వామి మొదలైన వారి ఏడెనిమిదేండ్ల కృషి ఫలితంగా నేడు రైతు-కూలీలు ఒక కుటుంబంగా కలిసిమెలసి పరస్పర గౌరవంతో మెలగుతున్నారు. 7 వ గుంటూరు జిల్లా రైతు మహాసభకు దావులూరు, కొల్లిపర, అనంతవరం, కఠెవరం మొదలయిన గ్రామాల వ్యవసాయ కూలీలు విశేషంగా తోడ్పడ్డారు.

స్వయం సహాయం.

"పెడతామంటే ఆశ, కొడతామంటే భయం" ఉన్న అమాయక కూలీలు ఒకరికోసం ఎదురు చూడకుండా, నేడు తమ కాళ్ళమీద తామే నిలబడగలుగుతున్నారు. స్థానిక సంస్థలు, ప్రభుత్వం నిర్లక్ష్యంగా వదలివేసిన పల్లెల్లో వ్యవసాయ కూలీలు పరస్పర సహకారంతో, స్వయం సహాయంతో తమ సమస్యలను తామే సొంతంగా పరిష్కరించుకోవడానికి ముందుకు వస్తున్నారు. బ్రాహ్మణ కోడూరు, అమృతలూరు గ్రామాల్లో ఉమ్మడి పాటలవల్ల వచ్చినసొమ్ముతో బావులవగైరాలనుమరమ్మతు చెసుకుంటున్నారు. అత్తోటలో గ్రంథాలయం స్థాపించ బోతున్నారు. అమృతలూరులో సంఘం కోసం యీ సంవత్సరం 3½ ఎకరాలు బంజరు సాగుచేసారు. 10 గ్రామాల్లో గ్రామ వ్యవసాయ కూలీ సంఘ ఆఫీసులు ఏర్పాటు చేసుకున్నారు. కొల్లివర, దుగ్గిరాల, కఠివరం మొదలయిన 40 గ్రామాలలో సంఘం కిరసనాయిలు పంపకం విషయమై తగు జాగ్రత్త తీసుకొంటూంది. కలపాడు, కంచర్లపాలెం, అమృతలూరులలో కలరా మొదలైన అంటు వ్యాధులను నివారించుటకు కృషి జరిగింది. కంచర్లపాలెంలో ఇంజక్షన్లు వేయించుకోమని ప్రచారం చేయగా, మామూలు సూదిమందు అంటే భయపడే కూలీలు "మాకు చేయండి, మాకు చేయండి" అని, హెల్తు ఇన్‌స్పెక్టర్లు ఆశ్చర్యపోయేలాగున కానేపట్లో 500 మంది చేయించుకున్నారు. కెంపాడులో కల్లు సారాయిలు నూటికి 99 మంది సేవిస్తారు. ఒక్క సంవత్సరంలో యిజారాదారుకు రు 1500/- వచ్చాయి. 2 ఎకరముల పొలం కొన్నారు. మారెమ్మ కొలుపుకు 3000 రూపాయలు వసూలు చేయాలని గ్రామ పెద్దలు నిర్ణయించారు. యీలా మారెమ్మ ఒక ప్రక్కన, గ్రామ పెద్ద లింకొక ప్రక్కన వ్యవసాయ కూలీలనపీక్కుతింటూంటే, కామ్రేడ్స్ వీటికి వ్యతిరేకంగా పోరాటం గావించారు, కొల్లిపర పంచాయితీబోర్డుకో ఒకకూలీసంఘ సభ్యుడుండటంవల్ల పల్లెలో రోడ్లు వేయించుకోగల్గారు. కొల్లిపర, వెల్లటూరు, చోడాయిపాలెం, మొదలయిన గ్రామాల్లో కోఆపరేటివ్ సొసైటీ భూములు వడ్డీ వ్యాపారస్తుల చేతుల్లోపడి పోకుండా చేయడానికి ప్రయత్నిస్తున్నారు. కొల్లిపర సొసైటి ప్రెసిడెంటు సభ్యుల దగ్గర హెచ్చురేట్లు వసూలుచేస్తుంటే, దాన్ని అరికట్టారు. మిగతాసొసైటీలకు ఆదర్శప్రాయమయ్యారు. పరవస్తుదాసు యొక్క స్వార్థపరత్వానికి, లంచగొండి తనానికి సహకారోద్యమం బలిమైపోయి అనేక పల్లెల్లో దెబ్బతింది. ఇప్పటికి, సొసైటీలంటే ఆపల్లెలోని కూలీలు భయపడుతూనే వుంటారు. ఆ భయాన్ని తీర్చి, సహకారోద్యమాన్ని సక్రమంగా నడిపించి, దాన్ని శ్రేయోదాయకంగా చేయడానికి జిల్లా సంఘం పనిచేస్తుంది.

కులకట్టుబాట్లు - సాంఘిక దురాచారాలు

మన వ్యవసాయకూలీ, పల్లెల్లో ఎంత లేనివాడయినా పెళ్ళిళ్ల వగైరా కర్మకాండకు తల తాకట్టు పెట్టిన డబ్బుతో కులపెద్దలకు త్రాగబోయించి, మాంసం తినిపించాల్సిందే; లేకపోతే కులపెద్దలు హాజరుగారు. ఇందువల్ల తాత పెళ్ళికి చేసిన అప్పు, తరతరాలుగా తీరుస్తూన్నా, అసలుఅసలుగానే వుంటుంది. దీని వల్ల వెట్టి చాకిరీలు, బానిసత్వం, తక్కువ కూలికి పనిచేయడం మొదలగు చిక్కుల్లో బడి వ్యవసాయకూలి కుటుంబాలెన్నో ఉక్కిరిబిక్కిరి అవుతున్నాయి. సంఘ శ్రేయస్సు కోసం పెద్దలుగాక, పెద్దల స్వార్థంకోసమే సంఘం ఉపయోగపడుతుంది. సంఘం బలపడినచోట్లయీలాంటివారిఆటలు సాగుటలేదు. దావులూరు, బ్రాహ్మణ కోడూరు, కఠెవరం మొదలగు గ్రామాల్లో వ్యవసాయకూలీసంఘ నాయకుల్నే కూలీలు తమ సంఘ పెద్దలుగా గుర్తిస్తున్నారు. మాల మాదిగల మధ్యఉన్న గజ్జ తగాదాలిపుడు మాయమై పోతున్నాయి. దుర్వ్యయాలు లేకుండా పెళ్ళిళ్లు, పేరంటాలు జరుగుతున్నాయి. ఉద్యమంతో కొత్త సంబంధమేర్పడిన బోడపాడు (మిగతా 8వ పేజీలో)

"ఒక అపూర్వఘటన"

[ఈ శీర్షికతో "అమృతబజార్ పత్రిక" (కలకత్తా) మొన్న 2 వ తేదీని ఒక ప్రధాన సంపాదకీయం రాసింది. చైనాలో కొమింటాంగ్ - కమ్యూనిస్టుపార్టీల మధ్య జరిగిన ఒడంబడికను ప్రశంసించింది: ప్రపంచ మందలి ప్రజాస్వామ్యవాదులందరికి యిదొక శుభవార్త - అని ప్రకటించింది. దాని పూర్తిపాఠం క్రింద ముద్రిస్తున్నాం.]

★

చైనా కొమింటాంగ్‌పార్టీ నాయకుడైన జంగ్-కై-షెక్‌కి, కమ్యూనిస్టుపార్టీ నాయకుడైన మా-సే-టుంగ్‌కి మధ్య ఒడంబడిక కుదిరినట్లు మాస్కో రేడియో ఒకవార్త ప్రకటించింది. నేటి చైనా ప్రభుత్వ పునర్నిర్మాణానికి యిది నాంది - అని కూడా మాస్కో రేడియో తెలియజేసింది. ఈ ఘటన ప్రపంచాని కంతకూ అతి ప్రధానమైనదనడంలో సందేహంలేదు. ఇప్పటికే ఆసియా ఖండాన్ని సామూహికంగా ఒక మహోప్లవం ముంచెత్తుతోంది. దానికితోడు యిప్పుడీ ఒడంబడిక జరిగింది. దీనితో ఆసియాఖండంలో అభ్యుదయకరమైన ఎన్నో మార్పులకు బీజాలు నాటబడ్డాయి. ప్రపంచమందలి ప్రజాస్వామ్య శక్తులకు, స్వాతంత్ర్య ప్రియులకు, ఎంతైనా సంతోషదాయకమైన వార్తయిది. ముఖ్యంగా మన భారతదేశ వాసుల్ని యీవార్త ఎంతైనా ఉత్తేజపరుస్తుంది. నెహ్రూపండితుడు చెప్పినట్లు, గతించిన కొద్ది సంవత్సరాలలో చైనా-భారతదేశాల ప్రజలమధ్య సన్నిహిత సంబంధం ఎక్కువైంది. ఒడంబడిక పత్రంయొక్క వివరాలు మనకింకా చేరలేదు. ఐనా, అందలి ప్రధానాంగాలేవో స్పష్టంగానే వున్నాయి. చైనాకంతకూ ఖచ్చితమైన ఐక్యకేంద్ర ప్రభుత్వం ఒకటి ఏర్పడబోతుంది. ఆ ప్రభుత్వంలో వివిధ రాజకీయపక్షాలకు ఇప్పటికంటే ఎక్కువ ప్రాతినిధ్యం ఉంటుంది. దేశమంతటా త్వరలో ఎన్నికలు జరుగుతాయి. తత్ఫలితంగా, ప్రజావిశ్వాసం చూరగొన్న నూతన ప్రజాప్రభుత్వం ఏర్పడుతుంది.

చైనా జాతి యిలా ఐక్యతను సాధించడంలో చైనా - రష్యా ఒడంబడిక చాలవరకు తోడ్పడిందని మాస్కో రేడియో సగర్వంగా తెలియజేస్తోంది. ఇందులో యదార్థం లేకపోలేదు. చైనాలో తీవ్రమైన అంతర్యుద్ధం చెలరేగక మానదని కలలుగన్న వారందరికీ యిప్పుడు ఆశాభంగం కలిగింది (కనీసం తాత్కాలికంగా నైనా)

కొమింటాంగ్ - కమ్యూనిస్టు పార్టీలమధ్య యిన్ని సంవత్సరాలుగా ఉంటూ వచ్చిన సంఘర్షణను అభివృద్ధి నిరోధకులు చక్కగా ఉపయోగించుకొనగలిగారు. యదార్థ విషయాలను కప్పిపుచ్చడం; పచ్చి అబద్ధాలను ప్రచారం చేయడం - ఇవీ వారి ఆయుధాలు. వీరు యీ విషయంలో రెండు పరస్పర విరుద్ధమైన దృక్పథాలను ప్రజలముందుపెట్టి వారిని మభ్యపెట్టచూచారు. సోవియట్ యూనియన్ చైనా కమ్యూనిస్టులకు నైతికంగా గాని, సాధన సంపత్తితోగాని, చేయూత నిచ్చి వున్నట్లయితే అది సోవియటు ప్రభుత్వపు సామ్రాజ్యకాంక్షకు దాఖలా అంటూ ఒక వైపున చాటా లూదారు. మరోవైపున, కొమింటాంగు ప్రభుత్వంతో సోవియటు సంధిచేసుకోవడం చైనా కమ్యూనిస్టుల్ని ద్రోహం చేయడం తప్ప మరొకటి కాదంటూ చిందులు తొక్కారు: కమ్యూనిస్టులకు సహాయంచేస్తే, విదేశవ్యవహారాల్లో సోవియటు చేయిచేసుకొంటూందని - కొమింటాంగుకు సహాయంచేస్తే పూర్వపు రష్యన్ జాతీయ దురహంకారానికి ప్రాధాన్యత ఇచ్చి, లెనిన్ సూచించిన ప్రపంచ విప్లవమార్గాన్ని నిరోధించి, మార్క్సిజానికి ద్రోహం చేస్తూంది అని - ఆకులు పోకలు అందని విషప్రచారం చేశారు. ఎలా చూచినా, స్టాలిన్ని ద్రోహిగా చిత్రించడమే వీరి ఉద్దేశం. ఇదంతా పరమ నీచమైన, అతి ప్రమాదకరమైన, రాజకీయపు ఎత్తుగడ మరొకటికాదు. అయితే యీ విషప్రచారంవల్ల లాభంపొందే వ్యక్తులు, అభివృద్ధి నిరోధకశక్తులు, ప్రపంచమంతటా ఉన్నారు. ఇప్పుడు కమ్యూనిస్టు - కొమింటాంగ్ పార్టీలమధ్య జరిగిన ఒడంబడికవల్ల వారందరి నోళ్ళకు తాళంపడింది!

విప్లవమనేది ఏ కొద్దిమంది వ్యక్తులో కలలు కనడంవల్లరాదు. అది ఒక వర్తకపు సరకు కాదు ఎగుమతి చేయడానికి. ఎగుమతిచేయడానికి; దానికొక కార్యక్రమం, ఒక పంథా ఉంటుంది. కొన్ని ప్రత్యేక పరిస్థితులు ఏ దేశంలోనైనా ఉన్నప్పుడే విప్లవం వస్తుంది. లేకపోతే రాదు. ప్రాచీనకాలపు బానిస విధానం జమీందారీ పద్ధతిగా మారినప్పుడు ఆ మార్పును విప్లవమని పిలుస్తాం. అలాగే జమీందారీపద్ధతి నుండి పెట్టుబడిదారీ విధానం, పెట్టుబడిదారీ విధానంలోంచి సోషలిజం వచ్చినప్పుడు ఆమార్పులన్నీ విప్లవాలు. కనుక ఏ ఘటన యొక్క స్వభావాన్నయినా నిర్ణయించేటప్పుడు దేశ, కాల పరిస్థితుల్ని దృష్టిలో పెట్టుకోవాలి.

కమ్యూనిస్టు - కొమింటాంగ్ పార్టీలమధ్య ఒడంబడిక జరిగినంతమాత్రంచేత, చైనాలో సోవియట్ విధానం అమల్లోకి రాదు. చైనా ప్రభుత్వాన్ని ఇప్పటికంటే విశాలమైన ప్రజాస్వామ్య పునాదులపై నిర్మించడానికి మాత్రమే అది తోడ్పడుతుంది. అంటే, అదొక రాజీమార్గమన్నమాట. నిజం చెప్పాలంటే సోవియటు విధానం సైతము ఒక జడవస్తువు కాదు. అనేకమార్పులలోనుంచి అదియిప్పటి స్వరూపంలోకి పరిణామంచెందింది. బోల్షివిక్ విప్లవంయొక్క మొట్టమొదటి దశ "వార్ కమ్యూనిజం." తరవాత పెట్టుబడిదారీ విధానంలోని కొన్ని లక్షణాలను అట్టిపెట్టుకున్నారు. దాన్నే "న్యూఎకనామిక్‌పాలసీ" అంటారు. ఆతరవాత శ్రామికవర్గ నియంతృత్వం వచ్చింది. అందలి ముఖ్య సూత్రాలను అమలు జరుపుతూ, పొరబాట్లను దిద్దుకుంటూ, ఈనాడు చక్కని సోవియట్ ప్రజాస్వామ్యంగా వికసించింది. నేటి సోవియట్ యూనియన్ ఒక సోషలిస్టు రాజ్యాంగయంత్రం. అక్కడకమ్యూనిజం ఇంకా అమల్లోకి రాలేదు. "ప్రతివ్యక్తియొక్క శక్తినిబట్టి పనిచేయించడం: చేసినపనినిబట్టి ప్రతిఫలం ముట్టజెప్పడం" - ఇదే నేటి సోవియట్ పంపకపు విధానం. చైనాలో యీనాడున్న పరిస్థితులెట్టివో సోవియట్ నాయకులకు బాగా తెలుసు. వారు చైనా ప్రజలమీద తమ సోవియట్ విధానాన్ని బలవంతంగా రుద్దదలచడంలేదు. అది వారి పద్ధతి కాదు. సలహాలు మాత్రమే యిస్తూ, మార్గం చూపుతారు. అంతే. నియంతలవలె పైనుంచి ఉత్తరువు లివ్వరు: సహాయం మాత్రమే చేస్తారు. చైనాదేశంయొక్క పునర్నిర్మాణ బాధ్యత అంతా చైనా ప్రజలకే యిస్తారు. ఈ సూత్రాల కనుగుణ్యంగానే యీమధ్య చైనా-రష్యా ఒడంబడిక జరిగింది. ప్రజాస్వామ్య సిద్ధాంతాల కనుగుణ్యమైన చైనా జాతీయైక్యత త్వరలోసిద్ధించడానికది ఎంతైనా తోడ్పడింది.

నేడు జంగ్-కై-షెక్ ఒక అభివృద్ధి పక్షంలో ఉన్నారు. దాదాపు పది సంవత్సరాలనుంచి ఆయన జపాన్ దురాక్రమణకు వ్యతిరేకంగా ఒక మహోద్యమాన్ని నిర్మించి, దానికి నాయకత్వం వహించాడు. శత్రువుతో భీకరమైన పోరాటం సలిపాడు. నాగరిక ప్రపంచంలో చైనా (మిగతా 7 వ పేజీలో)

బాల బాలికలకు

అబ్బాయిలూ, అమ్మాయిలూ!

మీరంతా రంగు రంగుల చొక్కాలూ, గౌనులూ ధరించుతారు. రంగు రంగు దుస్తులంటే మీకెంతో యిష్టం కాదూ! మీరు ధరించేవి సాధారణంగా పత్తి నూలుతో తయారయిన బట్టలు. తెల్లగా వుండే పత్తినూలుకు రంగులు వేయడంవల్ల మీరు రంగుదుస్తులు ధరించుతున్నారు.

మీలో చాలామంది ప్రత్తిమొక్కను చూచేవుంటారు. మన తెలుగుదేశంలో మెరక ప్రాంతాలలో ప్రత్తి పండుతుంది. శీతకాలంలో ప్రత్తిచేలు చూడ్డానికి ఎంతో వినోదంగా వుంటాయి. ప్రత్తికాయలు పండి పగిలివుంటాయి. వాటిలోనుంచి ప్రత్తిపింజలు కన్పించుతూ వుంటాయి. వాటినికోసి, అందులోనుంచి గింజలు తీసివేస్తే, దూది వస్తుంది.

మనదేశంలో పండే ప్రత్తి అంత శ్రేష్టమైనదికాదు. ముతకనూలు తీయ డానికి మాత్రమే అది ఉపయోగించుతుంది. ఏమంటే, మన దూది కురచ పోగు కలది. అమెరికాలో పొడుపాటిపోగుగల ప్రత్తిని పండించుతారు. అది సన్ననూలు తీయడానికి బాగా ఉపయోగపడుతుంది. మన దేశంలో కూడ పొడుగాంటి పోగులుగల ప్రత్తిని పండించడానికి ప్రయత్నించాలి. అందుకు విరివిగా పరిశోధనలు చేయాలి. అలా చేస్తే సన్ననూలుకొరకు విదేశాల ప్రత్తిని దిగుమతి చేసికోవాలసిన అవసరముండదు.

దూది రంగు తెల్లగా వుంటుందని మీకందరికీ తెలుసు. ప్రత్తిని "తెల్లబంగారం" అని పిలుస్తారు కూడ. కాని ఒక విషయం చెబితే మీరు ఆశ్చర్యపోతారు. మధ్య ఆసియాలోని సోవియట్ భూములలో రంగురంగుల ప్రత్తిని పండించుతున్నారు. మన దేశంలో కూడ అలా రంగురంగుల ప్రత్తిని పండించితే ఎంత బాగుంటుంది! అని వెంటనే మీరు అంటారు.

అప్పుడు నూలుకు, బట్టలకు ప్రత్యేకంగా రంగులు వేసుకొనేబాధ వుండదు. ఆ ఖర్చూ ఉండదు. చక్కగా సహజమైన రంగులలోపండిన ప్రత్తినుంచే రంగు రంగుల నూలు తీయవచ్చు. రంగు రంగుల బట్టలు తయారు చేసుకోవచ్చును. అంతే కాదు. అవి సహజమైన రంగులవడంచేత ఎండకు పాలిపోవు. ఉతికితే వెలియనూ వెలియవు.

సోవియట్ భూములలో రంగురంగుల ప్రత్తి పండటం ఎలా సాధ్యమైంది? అచటి శాస్త్రజ్ఞులు ఇందుకు ఎన్నెన్నో పరిశోధనలు చేశారు. ప్రపంచంలోవున్న పకరకాల ప్రత్తిమొక్కలను తెప్పించారు. పకరకాల మొక్కలకు అంటుగట్టి చూశారు. ఇలా ఎన్నో పరిశోధనలు చేయగా చేయగా, తమకుకావలసిన వివిధ రంగుల ప్రత్తిని యిచ్చే మొక్కలు తయారయాయి. వాటిని యిప్పుడు పొలాలలో పంటకు పెడుతున్నారు.

గోధుమరంగు, పచ్చరంగు ప్రత్తిని యిచ్చే మొక్కలు మరీ బాగా పండుతున్నాయి. ఈ మొక్కలకు తెగుళ్లు చాలా తక్కువ. సాధారణ ప్రత్తి మొక్కలకువలె తెగుళ్లు వీటికి తగులవు. ఎక్కువ ప్రత్తిని కూడా యిస్తాయి.

ఈ మధ్య సోవియట్ శాస్త్రజ్ఞులు పకరకాల ప్రత్తిమొక్కలను సృష్టించారు. కొన్ని మొక్కలవల్ల ఉన్నివలె అతిమృదువుగా వుండే ప్రత్తి పండుతూంది. సాధారణంగా ఉన్నికీ యీ రకం ప్రత్తికీ భేదం తెలిసికోవడంకష్టం! ఉన్నిమాదిరి ప్రత్తిని యిచ్చే మొక్కలను యింతవరకు 12 రకాల వాటిని కనుగొన్నారు.

పొలాలలో పంటకు పెట్టడానికి ఈ వివిధరకాల ప్రత్తి మొక్కలనురైతులకు ఈ సంవత్సరమే యిస్తున్నారు. ఇంకా వివిధరకాల రంగుల ప్రత్తి తయారయే మొక్కలను పెంచడానికి ప్రయత్నాలు జరుగుతున్నాయి.

ఈ విధమైన పరిశోధనలు మనదేశంలో కూడ జరగాలని మీరు కోరుతారు గదూ! ముద్దు బిడ్డలారా! మీరు కూడ పెద్దవాళ్ళయినాక, యిలాంటి కృషికి దోహదం చేస్తారుగదూ! మీలాంటి బిడ్డలందరూ అలా కృషిచేస్తే మన దేశం, మన ప్రజలు ఎంతో సంతోషిస్తారు.

— మీ దొడ్డమ్మ

దొంగ మార్కెట్లు

ఆల్ ఇండియా హిందూమహాసభ వర్కింగ్‌కమిటీ సభ్యుడు, నెల్లూరుజిల్లా హిందూమహాసభ అధ్యక్షుడు పైడా సుబ్బరామయ్యగారు బట్టలవ్యాపారం చేస్తున్నారు. 10-8-45 న కోవూరు తాలూకా దామవరం మజరా, నారాయణపురం గ్రామరైతులు తమ ఇండ్లకు 6 అంగుళముల తంతి చీలలు (తీగమేకులు) కావలెనివచ్చి 20 మైళ్ళునడచి పైడా సుబ్బరామయ్యఇంటికి వచ్చారు. వారిలో ఒకరైన కోవూరుతాలూకా రైతుసంఘ వర్కింగ్ కమిటీ మెంబరు, ఎన్నాబత్తిన బలరామయ్యగారు 3 వీసె చీలలు తీసుకున్నారు. ఆ 3 వీశలకు 1-2-0 ఇవ్వమన్నారు. 3 వీశె ఖరీదు 0-7-0 డబ్బుయిచ్చి బలరామయ్య బిల్లుఇవ్వమన్నారు. బిల్లు ఇవ్వను అవసరమైతే తీసుకో లేకపోతే పొమ్మన్నారు. 1 ఘంటకాలం బలరామయ్యగారు బిల్లు ఇవ్వమని వాదించారు. అప్పటికీ బిల్లు ఇవ్వనిరాకరించినందున, ప్రక్కనున్న పోలీసు కాన్‌స్టబుల్‌ని ఇప్పించమనిఅడిగాడు. బిల్లు ఇవ్వనట్లుగా సాక్ష్యం వుండమన్నారు. సుబ్బరామయ్య పెద్దవర్తకుడు. అయనతో నేను చెప్పనని పోలీసు కానిస్టబుల్ చల్లగా జారుకొన్నారు.

ఇంతలో ఇందుపూరు గ్రామస్థుడు పసుపులేటి రమణయ్య సాక్ష్యమిచ్చెదనని ముందుకు వచ్చాడు.

పై విషయాన్ని గురించి జిల్లా సేల్సు టాక్సు ఆఫీసరు సుబ్రమణ్యంనాయుడుగారికి బలరామయ్యగారువ్రాశారు. సెప్టెంబరు 15 వ తేదీన బలరామయ్యగారి స్టేటుమెంటు తీసికొన్నారు. తరువాత బలరామయ్య, ఆఫీసరు, వై. దశరధరామయ్య (కోవూరు తాలూకా రైతుసంఘ సహాయ కార్యదర్శి) వర్తకుని ఇంటికి వెళ్ళారు. అదే రకము చీలలు 50 వీసెలు ఉన్నాయి. వర్తకుని దగ్గర కూడా ఆఫీసరు స్టేటుమెంటు తీసుకొన్నాడు.

బలరామయ్యగారి తరవున సాక్ష్య మిచ్చిన రమణయ్య నెల్లూరు రైసుమిల్లులో గుమస్తాగా వున్నాడు. సాక్ష్యం చెప్పకుండా చేసేందుకు మిల్లు యజమాని సహాయమును పైడా సుబ్బరామయ్య కోరాడు. కాని, సాక్ష్యం చెప్పితీరుతానని రమణయ్య చెప్పి సాక్ష్యం చెప్పినాడు.

★

30-9-45 వ తేదీ సాయంత్రం అల్లక వీర్రాజుఅనే సామర్లకోటబట్టలవర్తకుడుతాను ఎరిగివున్న వ్యక్తుల పేరిట తనకు వచ్చిన మెట్టూరు మల్లు తాయాను కోటాగుడ్డ నుంచి గుడ్డ యిచ్చివేసినట్లు దొంగబిల్లులు వ్రాస్తున్నాడు. అదే సమయంలో ఒక చొక్కాకు సరిపోయే గుడ్డకోసం స్థానిక కమ్యూనిస్టు వి. నారాయణమూర్తి వెళ్లేడు. షాహుకారు గుడ్డ లేదనిచెప్పాడు. సృష్టిస్తూవున్న బిల్లులను, యెదుటవున్న గుడ్డను చూచి, యిదేమిటని అడుగగా "నా యిష్టం వచ్చినవాళ్ళకు యివ్వడానికి హక్కు వుంది. మీకు గుడ్డ యివ్వవలసిన అవసరం యేమీ లేదు — మీ యిష్టం వచ్చిన వాళ్ళతో చెప్పుకోండి" అని చెప్పేడు. కొట్టులోవున్న గుడ్డ విడుదలయ్యేటట్లు కనిపించలేదు. అడిగితే కొట్టవచ్చేటట్లు వున్నాడు.

స్థానిక కమ్యూనిస్టులు కొట్టుమీద ఒకనిని కావలావుంచి, పోలీసు స్టేషను కు రిపోర్టు చేసేరు. కొట్టులో తనిఖీ చేయగా, ఒకతాను మెట్టూరుమల్లు పాతగుడ్డలలోచుట్టబడి ఉండగా దొరికింది. ఆగుడ్డను గూర్చి సేఠ్‌జీని అడుగగా సువనబాబుగారి కిమ్మని టెక్స్‌టైల్ కంట్రోలరు చెప్పినట్లుగా అబద్ధమాడేడు. పోలీసు సబిన్‌స్పెక్టరు చివాట్లుపెట్టి గుడ్డను అక్కడనే అమ్మించి వేశారు.

ఈ ఘట్టం జరుగుతూ వుండగా, చుట్టూ వున్న వర్తకులు దాచివుంచిన గుడ్డను తొందరతొందరగా అమ్మివేశారు.

★

నర్సరావుపేట తాలూకా, యడ్లపాడులోని కూనిశెట్టి ఆదినారాయణ అనే గుడ్డల వ్యాపారస్థుడు యామర్తి నాగభూషణంకు గజం 0-10-0 కు అమ్మవలసిన మల్లును గజం 1-2-0 కు యిస్తాననీ; 1½ గజాలకు 1-11-0 తీసుకొని, యివ్వబోతుండగా గ్రామ కోఆపరేటివ్ స్టోర్సు ప్రెసిడెంటు వెళ్ళి, కంట్రోలు రేటు ప్రకారం డబ్బుతీసుకోమని చెప్పారు. తను యిస్తానన్నది మల్లుగాదనీ, నేత గుడ్డ అనీ చెప్పి చేతిలోని మల్లు తానును దాచిపెట్టి గుడ్డగాని, డబ్బుగాని యివ్వకుండా కొట్టు తాళంవేసుకొని వెళ్ళిపోయాడు. స్థానిక కమ్యూనిస్టులు రిపోర్టు వ్రాయించి, టెక్స్టైయిల్ కంట్రోలు ఆఫీసరుగార్కి పంపారు. కోఆపరేటివ్ స్టోర్సు ప్రెసిడెంటు, 7 గురు సాక్షులుకూడా రిపోర్టుయిచ్చారు. షాహుకారు తీసుకొన్న డబ్బైనా యివ్వకుండా ఎంత గొప్పపని చేశానో చూడండని తన ప్రతాపాన్ని చాటుకుంటున్నాడు. యింత బహిరంగంగా దొంగమార్కెటులో అమ్ముతున్న షాహుకారుపై తగిన చర్య వెంటనే టెక్స్టైయిల్ కంట్రోలు ఆఫీసరు తీసుకోవాలి.

ఈ చిన్న గ్రామంలో 6 గురు గుడ్డల చిల్లర వర్తకులున్నారు. టెక్స్టైయిల్ కంట్రోలు ఆఫీసరుగారికి యీ రిపోర్టు పోయినప్పటినుంచీ అంతా ఒకటైనారు. ఎంత డబ్బయినా యిస్తాం, నీ వెనుక నిలబడతామని కూనిశెట్టి ఆదినారాయణను పురిగొల్పుతున్నారు. సిగ్గులేకుండా ఈ దొంగవ్యాపారి 4, 5 వందలైనా ఖర్చుపెడతాననీ, "ముల్లు కోల" పత్రికకు చందా కట్టుతాననీ, కాంగ్రెసు జెండా కొట్టుపై కట్టుకుంటాననీ ప్రగల్భాలు కొట్టుతున్నాడు.

★

5-8-45 వ తేదీన చినగంజాం శివారు సొఫరాల కాపురస్తుడు తుమ్మలపెంట పిచ్చయ్య అనే రైతు చినగంజాం చిల్లరవస్త్ర సంఘ అధ్యక్షులయిన పొట్టి నారాయణగారి దుకాణమునకు వెళ్ళి 0-9-4 ఖరీదు శీలింగు గల మల్లుగుడ్డను యివ్వమన్నాడు. షావుకారు గ 1కి రు. 1-0-0కు తక్కువ కివ్వనన్నాడు. ఆరైతు రు. 1 చొప్పున 2 గజములు తీసుకొని బిల్లుయివ్వమని అడుగగా షాహుకారు యివ్వనిరాకరించాడు. యీ సంగతి జిల్లా టెక్స్‌టైల్ కంట్రోలు ఆఫీసరుగార్కి రిపోర్టు చేయగా ది 14-9-45 వ చినగంజామువచ్చి షాహుకారువద్ద, సాక్షులవద్ద స్టేటుమెంట్లు తీసికొన్నాడు. ఆరోజు పిచ్చయ్యగారు వరాయి గ్రామంలో వుండుటచేత అయనవద్ద స్టేటుమెంట్లు తీసికొనలేదు. గాని ఆఫీసరుగారు దొంగమార్కెట్టు చేసిన వారిని విచారించుటకు వచ్చి షాహుకారుయిచ్చిన అల్పాహారాలు తీసికొన్నందున న్యాయంగా విచారిస్తారా - అని ప్రజలు అనుమానిస్తున్నారు.

23-8-45వ తేదీని పొగాకు మార్కెటింగు కమిటీ సూపర్‌వైజరు ఎ. వి. పున్నయ్యగారు గెల్లి వెంకటేశ్వర్లుగారి గుడ్డల కొట్టుకు వెళ్ళి 2 గజముల మల్లుగుడ్డ యివ్వమని అడుగగా, షాహుకారు లేదన్నాడు. అంతట కొళ్ళపూడి వరసింహంగారి కొట్టుకు వెళ్ళి 2 గజములు యివ్వమన్నాడు. అయనగూడ అదే చెప్పినాడు. పున్నయ్యగారు పోలీసుసబ్‌యిన్‌స్పెక్టరుకు రిపోర్టు చేయగా, సబ్‌ఇన్‌స్పెక్టరుగారు వచ్చి అమల్లు గుడ్డను బయటపెట్టి అమ్మించాడు. కొళ్ళపూడి వరసింహంగారి కొట్లో 0-9-2 ఖరీదు గల మల్లు గుడ్డకు 1-6-0 ఖరీదు చేసే అద్దకం గుడ్డను పోటీపెట్టి అమ్మినాడు. ఇది సబ్‌ఇన్‌స్పెక్టరు ఎదుటనేజరిగింది. యీవిషయం జిల్లా టెక్స్‌టైల్ ఆఫీసరుగార్కి తెలియపరచగా ఆఫీసరుగారు పున్నయ్యగారివద్దకు వచ్చి షాహుకార్ల కొట్ల వద్ద కూర్చుండి పున్నయ్యను పిలిపించి స్టేటుమెంట్లు తీసికొన్నాడు. షాహుకార్లమీద ఎట్టి చర్య తీసికొన్నదీ తెలియదు.

13-9-45 వ వేల్పూరి వీరయ్యగారి కుమార్తు లక్ష్మీనారాయణగారి ప్యాప్పీ షాపుకు పర్చాయపాలెం గ్రామకాపురస్థుడు కారుమంచి వెంకటేశ్వర్లు వెళ్ళి, టార్చిలైటు బల్బుఅడుగగా 0-4-0కంట్రోలు దర గల్గిన బల్బును 0-10-0కు యిచ్చినట్లూ, బిల్లు యివ్వమనగా యివ్వనిరాకరించిపోట్లాడినట్లూ, బాపట్ల అడిషనల్ ఫస్టుక్లాసు మేజస్ట్రేటు వద్ద కేసుపెట్టబడింది.

రైతుల హాహాకారాలు

సోంపేట తాలూకా మామిడిపల్లి ముఠా రైతుసంఘ (ఉత్తరవిభాగ) యాజమాన్యాన 500 మందితో జరిగిన బహిరంగసభలో క్రింది తీర్మానాలు ఆమోదించబడ్డాయి:

1. ఈయేడు వర్షాలు సకాలంలో కురియనందున, పంటను గొంగళిపురుగు తినివేయడం వలన, మెట్టపంటలన్నీ నష్టమయాయి. కొద్దిగా మిగిలిన అణా, బేడ పంటవల్ల వచ్చిన గింజలు తిండికి సరిపోయాయి. వరిపంటకూడా వర్షంకురియనందున నాట్లు జరగలేదు. ఉబాలుఅయేటట్లులేవు. ఈ భూములకు నీటిసప్లయిచేసే చెరువులను, బట్టీలను మరమ్మతు చేయించవలసిందని ఎన్నాళ్లనుంచో జమీందారుగారిని కోరినప్పటికి, అందుకు తగిన ప్రయత్నం జరుగలేదు. ఇట్టి పరిస్థితుల్లో జమీందారీ ఉద్యోగస్థులు వచ్చి శిస్తు వసూళ్లకు జప్తులు మొదలైన జబర్దస్తీలు చేస్తున్నారు. ప్రభుత్వం వెంటనే జోక్యం కలిగించుకొని, యీ అక్రమచర్యల నరికట్ట వలసినదిగా కోరుచున్నాము. మాగ్రామరైతు సంఘం మూలంగా జలాశ్రయముల మరమ్మతుకు ఆర్డర్లు యిప్పించమని ప్రభుత్వమును కోరుచున్నాము.

2. వ్యవసాయపు మదింపులకు గాను ప్రభుత్వం వారిచ్చిన ఋణాలను తిరిగి ఇప్పుడే చెల్లించమని నిర్బంధించుట శోచనీయం. వర్షం లేనందున పంటలు పండలేదు. గ్రామ సాగుబడి లెక్కలవల్ల యదార్థస్థితి తెలియగలదు. కాబట్టి, మరికొంత కాలం వరకు వాయిదా యిప్పించగోరెదము.

3. కరువు దెబ్బకు గురియైన విశాలాంగులకు ప్రభుత్వం తెరచిన ఉచితభోజనశాలలను మూసివేయుట తగదని తీర్మానించడమైనది.

★

పిఠాపురం ఎస్టేటుకు చెందిన మల్లవరం చెరువు విస్తీర్ణం 1400 యకరాలు. దీనిక్రింద నాలుగు గ్రామాల్లో 10 వేల యకరాల ఆయకట్టు ఉంది. ఈ చెరువును 1909 లో ఒకసారి మట్టి మరమ్మతు చేయించారు. తరవాత అప్పుడప్పుడు తూముల మరమ్మతు, వగైరా స్వల్పమాత్రపు మరమ్మతులు చేయించారు. నేడు 1½ గజంవరకు చెరువు మేటవేసింది. రైతులు ఎన్నిసార్లు మొరపెట్టుకున్నా, ఎస్టేటువారు మరమ్మతు చేయించడంలేదు. దీనికి మొత్తం నాలుగు నీటి కాలువలున్నాయి. వాటిలో రామయ్య కాలువను, దుర్గాడకాలువను ఆపుచేయించి చెరువును మెరక, పల్లం సెద్యములకిచ్చి నీటి తీరువా వసూలు చేస్తున్నారు. ఇప్పుడు రామసాగరు కాలువనుకూడ మూయించి వేస్తున్నారు. వెంటనే ఎస్టేటువారు నీటి వనరులను ఆటంకపరచకుండా చూడాలనీ, చెరువుకు మరమ్మతు చేయించి గట్లు పోయించాలనీ, మాడభూషి భావనాచార్యులుగారు ప్రభుత్వాన్ని కోరుతున్నారు.

(6వ పేజీతరువాయి) కూడ ఉచిత స్థానమలంకరించేటందుకు కృషిచేశాడు. ప్రపంచంలో సగర్వంగా తలయెత్తుకొని తిరగడానికి కృతనిశ్చయులైన చైనాజాతి ప్రజలకు జంగ్-కై-షెక్ నాయకుడు. అయితే, చైనా విప్లవానికి నాయకత్వం వహిస్తూ, చైనాపురోగమనానికి చేయూత నిస్తూన్న కమ్యూనిస్టులపై ఆయన ధ్వజం ఎత్తిన విషయం అందరికీ తెలుసు. ఆచర్య చైనాదేశపు ప్రజాస్వామ్య పరిపాలనకు ఎంతైనా భంగం కలిగించింది. ఈ 8 సంవత్సరాలుగా జంగ్-కై-షెక్ తనలో తాను భావపర్షణకు లోనయాడు. అయితే, ఒక్క విషయం మాత్రం ఖచ్చితంగా రుజువైంది. శత్రువుతో పోరాటం సల్పేటప్పుడు ఎలాంటిరాజీషరతులకు లొంగలేదు. ధైర్యంగా తలఎత్తుకొని నిలబడ్డాడు. చైనాప్రజలస్వాతంత్ర్యసమరంలో ఆయన చరిత్రాత్మకమైన పాత్రను నిర్వహించాడు. మానవజాతి సాగిస్తూన్న విముక్తిపోరాటంలో ఒక ప్రముఖ స్థానమలంకరించాడు. నేడుచైనాప్రజల నిత్యజీవితంలో మహోప్లవగా ఉరకలెత్తుతూన్న అభ్యుదయశక్తులప్రాబల్యాన్నితానుగుర్తించకపోతే, తనకూ-తన దేశానికీ కూడా ముప్పవాటిల్లుతుందనే విషయాన్ని గ్రహించాడు. దీనిఫలితమే చైనా-రష్యాఒడంబడిక. ఇప్పుడు కమ్యూనిస్టు నాయకులతో రాజీచేసుకోవడానికి కారణంకూడా ఇదే.

చైనా ప్రపంచ అభివృద్ధి నిరోధకశక్తుల కొక కేంద్రం. అట్టి చైనాలో నేడు జాతీయైక్యతకు పునాది వేయబడుతూన్నదంటే వారి కుతంత్రాలు, కుట్రలు - అన్నీ పటాపంచలవుతున్నాయన్నమాట. ప్రపంచ కల్యాణాన్ని వాంఛించేసత్పురుషులంతా జంగ్-కై-షెక్‌నీ, మా-సే-టుంగ్‌నీ అభినందించకమానరు. వీరిద్దరిమధ్య జరిగిన ఒడంబడికచరిత్రాత్మకమైన ఒక అపూర్వఘటన. కోట్లాది ఆసియావాసుల భవిష్యత్తును నిర్ణయించడంలో ఈ ఒడంబడిక ఎంతైనా సహాయకారి అవుతుందని మా నమ్మకం.

పల్లెలలో నూతన సాంప్రదాయాలు

(6వ పేజీ తరువాయి) లాంటి గ్రామాల్లో కూడా యీ విభేదాలు తగ్గిపోతున్నాయి. కొట్లాటలు, కొతరలు చాలాభాగం తగ్గిపోయాయి. మూఢ విశ్వాసాలమీద, దురాచారాలమీద ఆధారపడి సమాజానికి వంతెళ్ళుగా తయారయిన కుల కట్టుబాట్లన్నీ సడలింపబడుతున్నాయి. రేపల్లె తాలూకా బేతపూడిలో పావరీలు క్రైస్తవమతం పేరిట తెచ్చిపెట్టిన తగాదాలను లూథర్ మిషన్, స్వాములవారిమిషన్ వ్యవసాయకూలీలు మరచిపోయి జనవరి పండుగనాడు ఏకమై, క్రైస్తవమతం బోధించిన సమత్వాన్ని ఆచరణలో పెట్టారు. పాదరీలకు పాఠం చెప్పి, నిజమయిన క్రైస్తవులుగా మెలిగారంటే, మనఉద్యమం ఎలాంటి ఉన్నతస్థాయికి పోయిందో, ఒక్కొరి మతగురువుల తగాదా కోలాతనం ఏ విధంగా నాశనమయిందో - కనపడుతుంది. నరసరావుపేట తాలూకా చిలకలూరిపేటలో జరిగిన వ్యవసాయకూలీ మహాసభలో తరతరాలుగా దూరంగా ఉండిపోయిన వేలూరు కూలీలు, మాలమాదిగలు విభేదాలు మరచి, ఒకేసంక్తిని భోజనంచేశారు. ఈ రెండు కులాలవారి వంబంధాలను ఏ రకంగా ముడివేసుకు కలిపివేశారో, మాల మాదిగ వైషమ్యాంతో కత్తులనూరే స్వార్థపరులకు ఎలాంటి గుణపాఠంనేర్పారో చూద్దాం. "మీలో మీకు హెచ్చుతగ్గులులేవా" అని వేలువెట్టి చూపే పెద్దకులాల స్వార్థపరులకు చెంప పెట్టుగా ఎలా కలిసి పోయారో, వేలూరు వ్యవసాయకూలీలు చూపించారు. వారి ఆచరణ మిగతావారందరికి మార్గదర్శకమయింది. కుల కక్షలను ప్రేరేపించు పాదరీలకు ప్రాణాంతకమయింది. ఈ విధంగా పల్లెల్లో యీనాడు విజ్ఞానంమీద, వికాసంమీద ఆధారపడిన నూతన సాంప్రదాయాలు నెలకొల్పబడుతున్నయి.

రాత్రిపాఠశాలలు — పఠన కేంద్రాలు

రాత్రి పాఠశాలలద్వారా, వయోజన విద్యద్వారాఅనేక చోట్ల ఉద్యమం నిర్మింపబడింది. కృష్ణా జిల్లాల్లో మొత్తం 25కి పైగా రాత్రి పాఠశాలలు నడుప బడుతున్నయి. వీటిలో 600కు పైగా వయోజనులు విద్యనభ్యసిస్తున్నారు. మొదట్లో వీటిమీద వ్యవసాయకూలీలకంత అభిరుచి లేకపోయినా, ఇపుడది ఎక్కువయింది. ఎంతమంది వర్కర్లున్నా ఇప్పుడు చాలటంలేదు; కేవలం అక్షరపరిజ్ఞానమేకాకుండా,విషయపరిజ్ఞానంకోసంఎక్కువ తహతహలాడుతూ వుండడం గమనించదగ్గ విషయము. ఈ పఠన కేంద్రాల్లో "ప్రజాశక్తి" పత్రిక,దినపత్రికలు చదివి, కొన్ని వందల మందికిఎప్పటికప్పుడు రాజకీయాలు, వార్తలు వివరింపబడుతున్నయి. ఇవేగాక క్రొత్తగా మన వుద్యమం చొరబడిన కొండపాటూరు లాంటి గ్రామాల్లోనయితం వైజ్ఞానిక కార్యక్రమం పిల్లల్ని, పెద్దల్ని, స్త్రీలను-అందరినీ ఎంతో ఆకర్షిస్తోంది. ఊడ్పులు, కలుపులు, కోతలు వగైరా వ్యవసాయపువనుల్లో సమిష్టి గేయాలు పాడుతున్నారు. విశేషించి, దావులూరు వ్యవసాయ కూలీలలో యీ కృష్ణ పెచ్చుపెరిగింది. అక్కడ ఫ్లేంబుర్రకథదళం ఒకటి తయారవుతోంది.

ప్రభుత్వం 'అధికాహారోత్పత్తి' చేయమని ప్రకటనలు చేయడమేగాని, యీ అయిదారు సంవత్సరాలలో అందుకు తగిన ప్రోత్సాహమేమీ యివ్వలేదు. పైగా ఎన్నో ఆవాంతరాలు కల్పించి, సాగుచేసేవారిని నిరుత్సాహపర్చింది. వివిధ తాలూకాల్లో 1500 ఎకరాల బంజర్లు సాగుచేస్తున్నాం. వాటిపైన స్థానికాధికారులు నిర్దాక్షిణ్యంగా, విపరీతమైన పెనాల్టీలు విధిస్తున్నారు. అమాలుది సమయంలో చెప్పుకోవల్సినదేమి చాలవరకు రద్దుచేయించుకొన్నాం. అయినా, స్వార్థపరులయినభూస్వాములోకవంక, లంచగొండి స్థానికాధికారులు మరొక ప్రక్క ఎన్నో చిక్కులుతెచ్చి కూలీల్లో కూలీలకు, రైతుకూలీలకు తగాదాలు పెడుతున్నారు. తీరా పంటకొచ్చిన పైరులను, లంచాలివ్వలేదనేఅక్కసుతో స్థానికాధికారులు కొన్నిచోట్ల కోయించివేశారు. బేతపూడి,పాంచాళవరం మొదలయిన గ్రామాలలో స్వార్థపరులు, సంఘవ్యతిరేకులు అయిన భూస్వాములు పైరును గొడ్లనుతోలి తొక్కించారు. బంజరు సాగుచేసుకున్నందుకు రేపల్లె తాలూకా పుప్పూడిలో ఒక స్త్రీని జైలుకు సయితం పంపించారు. వెంగపూడి రాజయ్యలాంటి భూస్వాములు వందలకొద్ది ఎకరాల బంజరును కూలీలకందకుండ కాజేశారు.ఊటు పాలెం, నేలపాడు, వేలూరు, కొల్లూరు,దావులూరు, జాగర్లమూడి మొదలయిన గ్రామాల్లో స్థానికాధికార్లులంచాలుపుచ్చుకొని,బోలెడన్ని పెనాల్టీలు విధించి సాగుచేస్తున్నవారి కడుగా మిలిటరీ కుటుంబాలకు పంపుతున్నారు. ఇందువల్ల కూలీల్లో కూలీలకుచీలికలు,స్పర్థలు రావడమే గాకుండ, గ్రామైక్యతకు భంగం వాటిల్లుతోంది. మిలిటరీ కుటుంబాలకు భూములివ్వవద్దని మాఉద్దేశ్యంగాదు. రేపల్లె తాలూకాలో కొన్నివేల ఎకరాల బంజరుంది. అలాంటి కుటుంబాలకు ఆలాంటిప్రదేశాలలో ప్రత్యేక కాలనీలు ఏర్పాటుచేసి, విశాలమయిన బంజర్లు యివ్వవచ్చు.

బంజర్లను సమిష్టిగాసాగుచేసి, సమిష్టిగా అనుభవించడం, ఉమ్మడి పనులకు, ప్రజాహిత కార్యాలకు సాగుచేయటం ముఖ్యంగా గమనించదగ్గ విషయం.

పోరాటాలు - విజయాలు

మన ఉద్యమం బలపడ్డ కొద్దీ, స్వార్థపరుల నోట్లోపచ్చివెలక్కాయ పడ్డట్లయింది. కుళ్లబోతుతనం పెరిగింది. ఈ బావతంతా లేనిపోని జగడాలు, పోరాటాలు తెచ్చిపెట్టడం సాగించారు. జిల్లాలో ముఖ్యంగా మనకు మూడురకాల వ్యతిరేకులు తయారయ్యారు. (1) స్వార్థపరులయిన భూస్వాములు, లంచగొండులైన స్థానికాధికారులు; (2) కులమత పెత్తందార్లు; (3) రాయిస్టులు - రంగామురా మొదలయినవాళ్ళు కాక, వీరివ్యతిరేకత ఎక్కువయిన కొద్దీ మన వుద్యమం కాకలు దీరి, సాటిలేని విజయాలతో బయటపడటం జరుగుతోంది. తాడికొండ, చోడాయపాలెం, బెల్లంవారిపాలెం, కతెవరంమొదలగు గ్రామాలలో భూస్వాములు కూలీలమీద తప్పుడు కేసులు పెట్టడం, కతెవరంలో పెద్దరైతులు తెచ్చిన వొత్తిడి ఎక్కువయిన కొద్దీ కూలీలు చైతన్యంతో పోరాటం సాగింటం, కూలీల న్యాయమైన కోర్కెలను బలపరుస్తూ మిగతా రైతాంగం అండగానిల్చి మూడు కేసుల్లో రెండు కేసులు గెల్పించి, బలమయిన నూతన సాంప్రదాయాన్ని నిర్మించడం-చూస్తే మన కూలీల్లోవున్న గట్టితనం, సంఘచైతన్యం రుజువవుతుంది. వేలూరు, దావులూరు, గ్రామాల్లో వీరు పెట్టిన అడ్డంకుల ఫలితంగా ఉద్యమం గట్టిపడింది. అమృతలూరులో నౌకర్లు సంవత్సరానికి 16 రోజులు పండగలకు, మీటింగులకు,గాను జీతముమీద సెలవు సంపాదించారంటే, మన కూలీసంఘ ప్రభావం ఏరకంగా నూతన సాంప్రదాయాలను నెలకొల్పుతున్నదీ విశదమౌతుంది. ఉద్యమం యిలా వ్యాపిస్తున్నకొద్దీ, ఇల మతపెత్తందార్లు నిప్పటిలడంకూడా ఎక్కువవుతూంది. ఉదాహరణకు దావులూరు నూపరు వయిజరు కేసు ఎంతో నీచంగా మనమీద దుష్ప్రచారంచేసి, తప్పుడు కేసు పెట్టినప్పటికీ అది కొట్టివేయబడింది. రేపల్లె తాలూకాలో ఉద్యమం కొత్తలో పాస్టర్లు, పంతుల్లూ మిషనరీలు అనేక అడ్డంకులు తెచ్చిపెట్టడానికి పూనుకున్నారు. కాని మన సంఘటితశక్తి ముందు వారి ఆటలు సాగలేదు. రాయిస్టులు, క్రిస్టియన్ ఫెడరేషన్ నాయకులు పలిపిన కుట్రలకు లెక్కలేదు. మాలమాదిగ కక్షలు లేవగొట్టారు. బేతపూడిలో తాలూకా లేబరు కోఆపరేటివ్ సొసైటీని విచ్ఛిన్నం చేశారు. బేతపూడి మహాసభనాడు జీ. యస్. హరిదారిలో పోటీగా మరో మీటింగుపెట్టి, నిప్పులు తొక్కిన కోడిలాగా గంతులు వేశారు. కాని ఆతను, అతనుతెచ్చిన బిళ్లా-కుర్చీలు తప్ప వేరేమీ మిగలలేదు; రంగాముఠా వారుకూడా అక్కడక్కడ మొండికాలు అడ్డం పెట్టాలని చూశారు. బిదానగరవుపాలెం, తూములూరులోని ఎర్రజండాలనుదించి వేయాలని ఎత్తులు వేశారు. కాని కూలీలు వారికి చక్కనిపాఠం నేర్పారు. ఎంతగొట్టు మిట్టాడినా ధక్కాముక్కాలు తిని నిమెంటయిన మన వుద్యమాన్ని చెదరగొట్టడం వీరి తరంకాలేదు.

ఇప్పటికి గుంటూరుజిల్లా వ్యవసాయకూలీ సంఘం మూడు మహాసభలను జరుపుకొంది. ఈ నూతన దశలో నాల్గవమహాసభ తెనాలి తాలూకా కొల్లూరులో జరపడానికి నిశ్చయమయింది. మారుమూలల గ్రామాలలో సహితం మన వుద్యమం, కొమ్మలు, రెమ్మలు వేసి వుప్పొంగింది. త్వరలోనే ఫలోన్మితమయ్యే అవకాశాలున్నయి. జిల్లాలోని వ్యవసాయ కూలీ స్త్రీ పురుషులు తండోపతండాలుగా యీ మహాసభకు తరలిరావాలి. మన సంఘటితశక్తిని కళ్ళారా గాంచి, మన సమస్యలను చర్చించుకొని ముందు కర్తవ్యమును నిర్ణయించుకోవాలి. మన వుద్యమాన్ని అన్ని తాలూకాలకు వ్యాపింపజేయాలి

జోహారులు

పొన్నకొల్లు కార్మిక యువకుల్లో మణిపూస కామ్రేడ్ వల్లి నరసింహారావు. పేద కుటుంబంలో పుట్టాడు. తండ్రి జట్టుకూలి. ఈ కామ్రేడ్ చిన్న వయస్సులోనే గుమాస్తాగా వుంటూ కుటుంబబాధ్యత తండ్రితో పాటు నెత్తిన వేసుకున్నాడు.

సుమారు సంవత్సరం క్రితం పార్టీలో కొచ్చాడు. యువజనసంఘ కార్యదర్శిగా పనిచేశాడు జిన్నూరు రైతుమహాసభలో ప్రశంసాపాత్రంగా పనిచేశాడు. పగలంతా పొట్టకోసం, రాత్రింతా పార్టీకోసం పనిచేసేవాడు. పట్టణంలోని దొంగవ్యాపారులకు పక్కలో బల్లెం; నిరంతరం బ్లాక్‌మార్కెటులపై దాడి సాగించడంద్వారా ఆ ప్రాంతపు పేదలకు తలలో నాలుకయ్యాడు. తన పేటలోని కుటుంబాలవారికి అంతకంటే ఎక్కువ ఆప్యాయం.

దుర్భర దరిద్రకారణంగా కామ్రేడ్ నరసింహారావు తన గుండె జబ్బును నయం చేసుకోలేకపోయాడు. వ్యాధితో బాధపడుతున్నా, దొంగవ్యాపారులతో పోరాడేవాడు. ఇతని తండ్రికూడా కుమారుని అడుగుజాడల ననుసరించేవాడు. కుమారునను ఉడికుబంగా ఉండేవాడు.

కామ్రేడ్‌కి వ్యాధి ముదిరింది. మంచం పట్టాడు. వైద్యంకోసం తండ్రిని బాధ పెట్టలేదు. తన బాధను ఎవ్వరికీ చెప్పుకోనూలేదు. పార్టీకి ఇది తెలిసింది. తాలూకా ఆర్గనైజరు పోదూరు హాస్పటలులో యితన్ని చేర్పించాడు. పట్టణ యువజనసంఘ సభ్యులు వైద్యానికి కావలసిన డబ్బు చందాలు వేసుకొని, తెచ్చి యిచ్చారు. డాక్టరు రామారావుగారు వ్యాధినివారణకు ప్రత్యేకకృషి చేశారు. కాని, 28-9-45న, హాస్పటల్లో చేరిన 20 రోజులలోనే మరణించాడు.

మరణవార్తవిన్న పట్టణ యువజనసంఘ సభ్యులు సంతాపంతో తాలూకాపార్టీ ఆఫీసుకు వచ్చారు. తమ కమిటీతో కామ్రేడ్ శవాన్ని కడిపారు. పట్టణంలో బకసంఘంవారు, యువజనసంఘ సభ్యులు, పార్టీసభ్యులుఅంతా ఎర్రజెండాలతో సుమారు 400 మంది శవాన్ని కామ్రేడ్ ఇంటివద్దనుంచి పూలదండలతో నింపి పూరేగింపుతో తీసుకువెళ్ళారు. కామ్రేడ్ సుబ్బారావు అతని ధైర్యసాహసాలను గూర్చి, పార్టీసేవనుగూర్చి ఉపన్యసించాడు. ఆ కామ్రేడ్ ఏ ఆశయాలకొరకు పనిచేస్తూ మరణించాడో ఆ ఆశయాలకొరకు నిరంతరం పనిచేస్తామని కామ్రేడ్స్ ప్రతిజ్ఞబూనారు. ఆ కామ్రేడ్‌ను కోల్పోయిన కుటుంబానికి ఇదే మా సానుభూతి.

నర్సాపురం తాలూకా కమ్యూనిస్టుకమిటీ

గొడవర్రు ప్రాథమిక ముస్లింలీగు పతాకోత్సవం

గుంటూరుతాలూకా గొడవర్రు ప్రాథమిక ముస్లింలీగు నూతనపతాకోత్సవం 28-9-45న యస్. లాసెనైన్ సాహెబ్‌గారి అధ్యక్షతను జరిగెను.

పతాకము యం. ఏ. జనాబ్ జిన్నా మైదానమునుండి బయలుదేరెను. సుమారు జన వందలమందికి పైగా ఉత్సవమున పాల్గొనిరి. అందులో కొందరు ముస్లిం లీగు గీతాలు ఉర్దూభాషలో పాడుచూ, "ముస్లింలీగు జిందాబాద్", పాకిస్తాన్ జిందాబాద్" "యం. ఏ. జిన్నా జిందాబాద్" అను జయజయానాదములతోను, బ్యాండు వాయిద్యములతోను, ఉత్సవము జయప్రదముగా జరిగెను.

ఇండోనీషియన్ ప్రజల స్వాతంత్ర్యోద్యమం

ఇటీవల కొత్తగా యేర్పడ్డ ఇండోనీషియన్ ప్రజా ప్రభుత్వానికి సహాయం అంతర్జాతీయ కార్మికవర్గం ప్రకటించింది. ప్రత్యక్ష కార్యాచరణకు పూనుకొంది. దీన్ని పతనం చేయడానికి డచ్చి సామ్రాజ్యవాదులు (యుద్ధానికిముందు జావా, బోర్నియో మొదలైన ఇండోనీషియన్ దీవులు డచ్చివారి స్వాధీనంలో ఉండేవి. సం.) మిలిటరీని తీసుకొచ్చారు. ఇండోనీషియన్ ప్రజా వుద్యమాన్ని అణచడం కోసం ఆస్ట్రేలియానుంచి మందుగుండు సామగ్రితో కొన్ని డచ్చిఓడలు ప్రయాణమౌతూంటే, భారతీయ నావికులు వాటిని నడప నిరాకరించారు.

గత 15రోజులనుంచీ ఆస్ట్రేలియన్ హార్బర్లలో వివిధ దేశాలకు చెందిన నావికులు తమ సంఘటితశక్తిని ప్రదర్శిస్తూన్నారు. వారితో భారతీయులు కూడా చేయికలిపారు.

మొట్టమొదట బ్రిస్బేన్, సిడ్నీ ఓడరేవులలో ప్రారంభమయింది పోరాటం. అక్కడి కార్మికులు ఇండోనీషియాకు పోయే ఓడలలో ఆయుధ సామగ్రిని చేర్చ నిరాకరించారు. "వాటర్‌సైడ్ వర్కర్స్ ఫెడరేషన్" అనే కార్మికసంఘ కార్యదర్శి, జేమ్సు హీలీ, క్రిందివిధంగా ప్రకటించారు:

"అంతర్జాతీయ కార్మికవర్గమంతా ఒకటిగా ఉండాలి. మిత్రరాజ్య ప్రణాళికను అమలుజరపాలి. యీ మధ్యనే ప్రపంచ ట్రేడ్‌యూనియన్ కాంగ్రెసుమహాసభ పిలుపు యిచ్చింది. అందువల్ల, ఇండోనీషియన్ ప్రజలచే కొత్తగా యెన్నుకోబడిన ప్రజా ప్రభుత్వాన్ని అణచడంలో సామ్రాజ్యవాదులు చేసే ప్రయత్నానికి మనమెవరమూ సహాయం చేయకూడదు."

ఈ నిర్ణయాన్ననుసరించి హార్బరు కార్మికులంతా సమ్మె చేశారు. బ్రిస్బేన్ హార్బరులో 12 డచ్చి ఓడలు ప్రయాణం కాకుండా నిలిచిపోవలసి వచ్చింది. ఆస్ట్రేలియన్ కార్మికులతోబాటు ఇండోనీషియన్ నావికులు కూడా సమ్మెకట్టారు.

అప్పుడు డచ్చియజమానులు, షిప్‌యార్డు అధికారులు, చైనా దేశస్థుల్ని తీసుకొచ్చి ఓడలను నడపడానికి ప్రయత్నించారు. కాని, యీ ప్రయత్నం కూడా విఫలమైంది చైనా నావికుల సంఘం సమ్మెను బలపరిచింది.

విమానాలలో భారతీయుల్ని దింపారు

మరొక మార్గమేదీలేక, డచ్చి అధికారులు సిడ్నీనుంచి మెల్బోర్న్‌కి విమానాలలో నిరుద్యోగులుగాఉన్న భారతీయుల్ని తీసుకొచ్చారు. కార్పిక్ అనే ఓడను నడపవలసిందని వారిని ఆజ్ఞాపించారు. మెల్బోర్న్ బస్సు డ్రైవర్లు వీరిని హార్బరుకు చేర్చనిరాకరిస్తే, వారిని డచ్చివారే తమ సొంత బస్సులలో తీసుకొచ్చారు.

ఈ వార్త మెల్బోర్న్ హార్బరు కార్మికసంఘానికి చేరింది. వెంటనే వారు కార్యాచరణకు పూనుకున్నారు. యూనియన్ కార్యదర్శి భారతీయుల్ని హెచ్చరించడం కోసం ఓడమీదికి యెక్కబోతూంటే, డచ్చి సైనికులు తన్ని అటకాయించారు. అప్పుడు యూనియన్ సభ్యులు, ఇండోనీషియన్ కార్మికులు ఒక పెద్ద గుడ్డమీద హిందుస్థానీ భాషలో నినాదాలురాసి, దాన్ని యెగురవేశారు. ఓడమీదికి కరపత్రాల కట్టలు విసిరారు. తరువాత, హిందుస్థానీ భాషను మాట్లాడే ఇండోనీషియన్లు మెగఫోన్లతో గట్టిగా భారతీయుల్ని సంబోధిస్తూ ఉపన్యాసాలిచ్చారు, ఇండోనీషియన్ జాతీయగీతాన్ని ఉద్రేకపూరితంగా పాడారు.

ఆతరవాత, ఆస్ట్రేలియన్లు, ఇండోనీషియన్లు, భారతీయులు, అంతాకలిసి "స్వతంత్ర ఇండోనీషియాకు జై" "స్వతంత్రభారత్‌కి జై" అని నినాదాలు చేశారు.

భారతీయులు ఇప్పుడు యదార్థం తెలుసుకున్నారు. వారి ప్రతినిధులేఓడపైనుంచి స్వయంగా ఉపన్యసించ సాగారు మరునాడు తప్పకుండా ఓడనువిడిచివస్తామని వాగ్దానంచేశారు. కాని డచ్చిసైనికులు వారిని నివారించారు. డచ్చి అధికారులు యెవరికీతెలియకుండాఓడను సముద్రంలోకి తోయడానికి స్టీమర్లు తీసుకురాబోతూంటే, సమ్మెదారులు యిది కనిపెట్టి స్టీమర్లు కార్మికుల్ని కూడా హెచ్చరించారు. వెంటనే వారు సమ్మెలోచేరారు. అప్పుడు డచ్చి ఉద్యోగస్థులే స్వయంగా ఓడను సముద్రంలోకి తీసుకెళ్ళారు.

> ## కామ్రేడ్ జోషి పిలుపు
>
> భారతదేశంలోవున్న కార్మికసంఘాలన్నీ ఇండోనీషియన్ప్రజల స్వాతంత్ర్యోద్యమాన్ని బలపరచ వలసిందని, దాన్ని అణచడానికి ఆయుధాలు, మందుగుండు సామగ్రి, ఓడలు సైన్యం పంపడాన్ని ఖండిస్తూ తీర్మానాలు చేయవలసిందనీ, కామ్రేడ్ పి. సి. జోషీ విజ్ఞప్తిచేస్తున్నాడు.

30 వేలమంది కార్మికుల సమ్మె

ఈరోజున 30,000 మంది కార్మికులు ఇండోనీషియన్ ప్రజల స్వాతంత్ర్యపోరాటాన్ని బలపరుస్తున్నారు. వారికి నాయకత్వం వహించి నడుపుచున్నది 15 ఆస్ట్రేలియన్ కార్మికసంఘాలు, క్వీన్స్‌లెండ్ న్యూసౌత్ వేల్స్ లేబర్‌యూనియన్లు, చైనా నావికుల సంఘం, ఇండోనీషియన్ కార్మికులు. ఈ 30,000 మంది డచ్చి ఓడలలో ఆయుధ సామగ్రిని వేయ నిరాకరించారు. ఓడలకు మరమ్మతు చేయమన్నారు. సామాన్లు చేర్చమన్నారు.

ఆస్ట్రేలియన్ కార్మికులు ప్రారంభించిన యీసమ్మెను న్యూజిలాండ్ హార్బరు కార్మికులు బలపరుస్తూ తీర్మానం గావించారు.

అమెరికన్ కార్మికులు కూడా త్వరలోనే సమ్మెచేయవచ్చు. అంతర్జాతీయ హార్బరు కార్మిక సంఘానికి అధ్యక్షుడైన హారీబ్రిడ్జెస్ నుంచి జేమ్సు హీలీకి యిప్పుడే ఒక కేబుల్ వార్త వచ్చింది. అందులో ఆయన ఆస్ట్రేలియన్ కార్మికుల సమ్మెను బలపరుస్తూ సందేశం పంపించాడు.

"మిత్రరాజ్యాలొనరించిన ప్రతిజ్ఞను ధిక్కరించి డచ్చి సామ్రాజ్యవాదులు ఈవిధంగా వలసదేశాల ప్రజల్ని అణచడానికి చేసే ప్రయత్నాన్ని విరోధించడం అవసరం" అని ఆయన ఈ సందేశంలో తెలియజేశాడు. బ్రిడ్జెస్ ఇంకా యిలా రాశాడు.

"మిత్రరాజ్య ప్రణాళికలో ఉన్న ఆశయాంతనుగుణ్యంగా (ప్రపంచ ప్రజలందరికీ స్వాతంత్ర్యం ఉండాలనేది) మా యూనియన్ ఒక కార్యక్రమాన్ని తయారుచేస్తోంది. జపాన్ దురాక్రమణ దారులకు ఇనుమును పంపించకుండా సమ్మెచేసిన అమెరికన్ హార్బర్ కార్మికులు, జపాన్ దురాక్రమణను యెదుర్కొడానికి అనేక పోరాటాలు సలిపి స్వాతంత్ర్యం కొరకు కృషిసల్పే ఇండోనీషియన్ ప్రజలకువ్యతిరేకంగా ఎట్టి సహాయమూ చేయరు. ఇది మా శపథం"

ప్రజారాజ్య స్థాపన

అగస్టు 17వ తేదీని, అనగా జపాన్ ప్రభుత్వంలొంగిపోయిన మూడోరోజున,ఏర్పడింది ఇండోనీషియన్ ప్రజాప్రభుత్వం. ప్రజాస్వామ్య సూత్రాలకు కట్టుబడి దాని రాజ్యాంగం తయారుచేయబడింది. మిత్రరాజ్యాలకు సహకారం చేయడమే దాని ఆశయమని ప్రకటించారు. కాని తిరిగి డచ్చి సామ్రాజ్యవాదుల పరిపాలన వస్తే, దాన్ని ఎదుర్కొని తీరుతామని తెలియజేశారు. ఈ తాత్కాలిక ప్రభుత్వానికి ప్రెసిడెంటు డాక్టరు సొకార్నో. ఉపాధ్యక్షుడు డాక్టర్ మహమ్మద్ హట్టా....

ఈ రోజున ఇండోనీషియాలో రెండే రెండు పక్షాలున్నాయి. ఒకటి: తాత్కాలిక జాతీయ ప్రభుత్వం, దానివెనుకనున్న ఇండోనీషియన్ ప్రజలు. రెండు: జపాన్ సామ్రాజ్యవాదులు, డచ్చి సామ్రాజ్యవాదులు. అక్టోబరు 4వ తేదీని డచ్చిసేనలు ఇండోనీషియాలో ప్రవేశించ బోతున్నాయి. అంతవరకూ "లా అర్డరు" కోసం డచ్చి అధికారులు జపానువారిమీద ఆధారపడుతున్నారు. జావాలో ఉన్న ఆస్ట్రేలియన్ విలేఖరుల వార్తల ప్రకారం, డచ్చి అధికారులంతా జపాన్ సైన్యాధికారికి అతిథులుగా ఉన్నారు బటేవియాయందలి "హోటల్‌డి ఇండీస్" లో వారు విడుదులారగిస్తున్నారు. ఇండోనీషియన్ ప్రజల ఉద్యమాన్ని అణచవలసిందని జపాన్ అధికారుల్నివారు కోరారు జపాన్ అధికారులు యిదివరకే అనేక సభలను చెదరగొట్టారుకూడ.

ఇండోనీషియాలో డచ్చి సామ్రాజ్యవాదుల పెత్తనాన్ని తిరిగిస్థాపించడానికి నేడు సహాయపడేది జపాను సైనికులు, జపాను సి. ఐ. డి లేనని "డెయిలీ టెలిగ్రాఫ్" విలేఖరి (ఆస్ట్రేలియా) తెలియజేస్తున్నాడు.

జపాను సి. ఐ. డి. శాఖవారు డాక్టరు సొకార్నోనీ, డాక్టరు హట్టానీ, అరస్టు చేయడానికి ఈమధ్యనే వారంట్లు జారీ చేశారు. ఇండోనీషియన్ రిపబ్లిక్కు జపాను అనుకూల ప్రభుత్వమంటూ దుష్ప్రచారం చేసే సామ్రాజ్యవాదులకు ఇది చక్కని జవాబు.

ఆస్ట్రేలియన్ లేబరుప్రభుత్వం చేయూత

డచ్చి సామ్రాజ్యవాదుల కుట్రను ఆస్ట్రేలియన్ పార్లమెంటులో చక్కగా బట్టబయటచేశారు ప్రభుత్వసభ్యులు (ఆస్ట్రేలియాలో లేబరుపార్టీ అధికారంలో ఉంది. సం.) తమ ఓడల్లో ఆహారపదార్థాలూ మందులూమాత్రమే వేస్తున్నామనిపైకిచెప్పి, రహస్యంగా ఆయుధ సామగ్రిని దాటవేస్తున్నారని ఆస్ట్రేలియన్ ప్రధాని ప్రకటించాడు. 30 వేల మంది డచ్చి సైనికుల్ని తమ ఓడరేవులలోంచి తీసుకు వెళ్ళడానికి వీల్లేదని ఆస్ట్రేలియన్ ప్రభుత్వం నిషేధించింది.

బ్రిటన్ - ఇండియా దేశాల్లోఉన్న కార్మికవర్గం తమ సోదర కార్మికుల సహకారం కొరకు ఆస్ట్రేలియన్ ప్రజాస్వామ్య వాదులు, విజ్ఞప్తి చేస్తున్నారు. బ్రిటన్, ఇండియాల నుంచి సైనికుల్ని ఇండోనీషియాకు తీసుకొస్తూంటే, మీరు చూస్తూ ఊరుకొంటారా? అని ప్రశ్నిస్తున్నారు.

—"పీపుల్స్‌వార్" నుండి

> ## ఆంధ్రరాష్ట్ర ట్రేడ్‌యూనియన్ కౌన్సిల్
> ## జనరల్‌బాడీ సమావేశం
>
> అక్టోబరు 26, 27, 28 తేదీలలో బెజవాడలో
>
> ఆంధ్రరాష్ట్ర ట్రేడ్‌యూనియన్ కౌన్సిల్ జనరల్‌బాడీ సమావేశం యీనెల 26, 27, 28 తేదీలందు బెజవాడలో జరుగుతుంది. ఇంతకు పూర్వం 19, 20, 21 తేదీలందు జరుగుతుందని తెలియపరచాం. కాని కారణాంతరాలవలన మార్పుచేయవలసి వచ్చింది. ముఖ్యమైన సమస్యలు చర్చించబడుతాయి. సభ్యులందరు తప్పక హాజరుకావలెను. స్థానిక ఆర్గనైజర్లను కూడ ఆహ్వానించుచున్నాము.
>
> హాజరయ్యేవారు 20వ తేదీ లోపుగా బెజవాడ సిటీ ట్రేడ్‌యూనియన్ కౌన్సిల్‌కు ముందుగా తెలియపరచవలెను. లేనిపక్షమున భోజనాది వసతులు సమకూర్చుట ఇబ్బందిఅవుతుంది. 25వ తేదీ రాత్రికే సభ్యులందరూ హాజరుకావలెను.
>
> ### ఎజండా
>
> 1. కార్యదర్శి నివేదిక
> 2. నిర్మాణ సమస్యలు
> 3. నిరుద్యోగ సమస్య
> 4. కావరపక్ష ఎన్నికలు
>
> ప్రతి సంఘము ముందుగా రిపోర్టులువ్రాసి రాష్ట్ర ఆఫీసుకు పంపాలి.
>
> ఇట్లు,
> పిల్లలమర్రి వెంకటేశ్వర్లు,
> ప్రధానకార్యదర్శి.

రాష్ట్ర నిమ్నజాతుల కార్యవర్గం

సెప్టెంబరు 29 వ తేదీన నరసాపురంలో ఆంధ్రరాష్ట్ర షెడ్యూలుజాతుల ఫెడరేషన్ కార్యనిర్వాహకసంఘ సమావేశం జరిగింది. వి. గోపాలకృష్ణగారు అధ్యక్షత వహించారు.

పూనా ఒడంబడికను రద్దుచేయాలని. కాని భారత రాజ్యాంగంలో షెడ్యూలుజాతుల వారికి ప్రత్యేక నియోజకవర్గాలు కావాలని. తీర్మానించారు ప్రస్తుతమున్న ప్రతినిధుల సంఖ్యను హెచ్చించాలని కోరారు.

యుద్ధసమయమున్ను వచ్చిన ప్రతి స్త్రీ పురుషునికి ఓటింగుహక్కు యివ్వాలని కోరారు.

కొవ్వలి గ్రామంలో భూస్వాముల దౌర్జన్యానికి గురిఅయి, ఎముకలు విరిగి బాధపడు తున్న నక్కా చినవెంకయ్యగారిని ప్రశంసిస్తూ అళ్ల చలమయ్యగారు ఒక తీర్మానం ప్రవేశపెట్టారు. ఈ తీర్మానంలో భూస్వాముల దౌర్జన్యం ఖండించబడింది. ఈలి వాడపల్లిగారు దీనిని బలపరిచారు.

నిమ్నజాతుల కార్యవర్గం యీలాంటి న్యాయం, ధర్మబద్ధమైన తీర్మానాన్ని ఏకగ్రీవంగా అంగీకరించవలసింది. కాని విచిత్రమేమంటే కొందరు ప్రముఖులు వ్యతిరేకించారు. యన్. హరి, ప్రకాశరావుగారలు నాయకత్వం వహించి తీర్మానాన్ని తోసి వేయించారు.

ఈవార్త పీడితప్రజల క్షేమంకోరే వారందరి మనస్సులను కలతపరుస్తుంది. నక్కా చినవెంకయ్యగారు క్రిందటి యేడాది ఆంధ్ర రాష్ట్ర షెడ్యూలుజాతుల ఫెడరేషనుకు కార్యదర్శి. ఏలూరు తాలూకా నిమ్నజాతులలో తన సేవద్వారా అభిమానం సంపాదించారు. కొవ్వలి వ్యవసాయకూలీల పోరాటాన్ని నడిపారు. భూస్వాముల దౌర్జన్యానికి గురిఅయి, ఎముకలు విరిగి నేడు బాధపడుతున్నారు.

అలాంటివారికి ఏ ప్రజాసంఘమైనా సానుభూతి చూపుతుంది. అలా చేయడం నిమ్నజాతుల ఫెడరేషన్ ధర్మం. వైతిర్మానం ఎదిరించిన పెద్దలు ఎలాంటివారో చూదాం.

ఎన్. హరిగారు ప్రభుత్వోద్యోగి. 300 రూపాయల జీతం పుచ్చుకొంటున్న రిక్రూటింగు ఆఫీసరు. రెండోవారు. కోనాడ సూర్యప్రకాశరావుగారు. వీరుప్రస్తుతం కార్యదర్శిగా వున్నారు. వీరికి మాజీకార్యదర్శి అయిన చిన వెంకయ్యగారి యెడల ద్వేషమే ప్రధానంగా కన్పించింది. పీడితప్రజల తరపున ధైర్యంగా నిలబడి బాధించబడిన తమ సోదరునికి సానుభూతి కూడ నిరాకరించారు.

నిమ్నజాతుల ఉద్యమం ప్రారంభదశలో వుంది నాయకులు స్వార్థపరులుగా ఉంది. ఎంతో కృషిచేసి ప్రజలలో చైతన్యం కలిగించాలి ఉద్యమాన్ని నిర్మించాలి పదవుల కొరకు కీచులాట ఉద్యమానికివేరు పురుగు లాంటిది.

ఆంధ్ర షెడ్యూలుజాతుల ఫెడరేషన్ నాయకులు అప్పుడే కీచులాట ప్రారంభించారు. క్రిందటి మహాసభలో ఎన్నికలు జరుపలేదు. తరువాత కొందరు బెజవాడలో 29-7-45 న సమావేశమై ప్రకాశరావుగారిని కార్యదర్శిగాను, వి. గోపాలకృష్ణగారిని అధ్యక్షుడుగాను ఎన్నుకున్నారు. ఈ ఎన్నికలు సక్రమం కావని చినవెంకయ్యగారు అప్పుడే పత్రికలలో ప్రకటించారు.

ఇంతేగాదు. హరి, ప్రకాశరావు, గోపాలకృష్ణగార్లు నిమ్నజాతులలో పనిచేస్తున్న కమ్యూనిస్టులను తమ సంఘాలనుండి తీసివేస్తున్నారు. 30-7-45 బెజవాడ సమావేశంలో ఒక పార్లమెంటరీబోర్డును ఎన్నుకున్నారు. దానికి అధ్యక్షుడుగా అళ్ళ చలమయ్యగారిని, కార్యదర్శిగా గుంటూరు బాపనయ్యగారిని ఎన్నుకున్నారు. కాని నర్సాపురంసమావేశంలో (29-9-45) బాపనయ్యగారిని తొలగించి వేరొకరు ఈలి వాడపల్లిగారిని నియమించారు.



నక్కా చిన వెంకయ్యగారు

అగస్టు 16 వ తేదీని కొవ్వలి గ్రామంలో (ప గోదావరి) సవర్ణ భూస్వాముల దౌర్జన్యానికి గురిఅయిన వీరికితీవ్రమైనగాయాలు తగిలాయి. మద్రాసులో గవర్నమెంటు ఆసుపత్రికి తీసుకెళ్ళి పరీక్ష చేయించితే, 16చోట్ల ఎముకలువిరిగినట్లుస్పష్టమైంది ప్రస్తుతము లేవలేని పరిస్థితిలో ఉన్నారు.

గాంధీ జయంతి ఉత్సవం - వీర్రాజు దుండగీడుతనం

గుడివాడతాలూకా వెంట్రప్రగడ గ్రామములో ఒక దుర్మార్గుడున్నాడు రెండు ఖూనీ కేసులలో యితడు ముద్దాయి. చల్లపల్లిరాజా ముఠాకుచెందిన జస్టిస్‌పార్టీ ప్రముఖుడు. ఈ ప్రజాకంటకుని పేరు కూచిపూడి వీర్రాజు. ఇతడు కొలదిమంది భూస్వాముల సాహాయ్యంతో త్రాగుబోతుల ముఠాను పోషించుచూ, ప్రజలను అనేక సంవత్సరాలనుంచి పీడించుచున్నారు

ఈ గ్రామం స్వాతంత్ర్యోద్యమంలో పేరెన్నిక గాంచింది. 1930-32 శాసనోల్లంఘనోద్యమాలలో జైళ్ళకు వెళ్ళిన కాంగ్రెసు దేశభక్తులనేకమంది వున్నారు. ఈ కాంగ్రెసువాదులు రైతు-కూలీ సంఘాలను నిర్మించారు. స్వాతంత్ర్య సందేశాన్ని ప్రజాసామాన్యంలోకి తీసుకువెళ్ళారు. క్రమంగా యీ కాంగ్రెసు దేశభక్తులంతా కమ్యూనిస్టుపార్టీలోకి వచ్చారు.

వీర్రాజు యింతవరకు ఎన్నడూ కాంగ్రెసుకి ఓటైనాచేయలేదు. 1940జిల్లాబోర్డుఎన్నికలలో కాంగ్రెసుతో పోటీచేసి ఓడిపోయాడు. యుద్ధప్రారంభదశలో రహస్యంగా వుంటున్న కమ్యూనిస్టులను పట్టించడానికి వీర్రాజుముఠా పోలీసులకు సాయపడింది. ఒకవైపునవీర్రాజు యుద్ధకమిటీలో వున్నాడు. రెండోవైపున జపాను ప్రమాదం హెచ్చాక వీర్రాజు విధ్వంసక చర్యలను ప్రోత్సహించాడు. ఈమధ్య పార్వర్డుబ్లాక్ నాయకులైన పేట బాపయ్య, అన్నే అంజయ్యగార్లను ఆహ్వానించుచూ సభ జరిపాడు. ఈవిధంగా వీర్రాజు కాంగ్రెసు జరగా తగిలించుకొన్నారు.

ఈప్రజావిరోధి తనత్రాగుబోతులముఠాతో 5 వ తేదీన గాంధీజయంతి జరిపాడు. ఈ ఉత్సవం త్రాగుబోతుల తందనాలతో ముగిసింది.

7 వ తేదీన గ్రామప్రజలంతా కలసి ఐకమత్యంతో గాంధీజయంతి జరిపారు. 110 జతల ఎడ్లనుకట్టి గాంధిజీ ఫొటోను వూరేగించారు. 2 వేల ప్రజలు ఆబాల గోపాలం అత్యుత్సాహంతో పాల్గొన్నారు. కాంగ్రెసువాదులు త్రివర్ణ పతాకంతోనూ, కమ్యూనిస్టులు ఎర్రజెండాతోనూ, ముస్లింలు లీగ్‌జెండాతోనూ పాల్గొన్నారు.

సాయంకాలం గొప్ప బహిరంగసభ జరిగింది. 3 వేల ప్రజలు హాజరయ్యారు. కృష్ణాజిల్లా కమ్యూనిస్టుకమిటీ సభ్యుడైన కొండపల్లి సీతారామయ్య ఉపన్యసించారు. గాంధీజీ జీవితాన్ని, కాంగ్రెసు చరిత్రను తెలిపారు నేడు కాంగ్రెసు నాయకత్వము అనుసరించుతున్న పాలసీ ఎలా దేశంలో చీలికలు కలుగజేస్తూ వుందో తేటతెల్లం చేశారు. రౌడీలు, దొంగ వ్యాపారులు, జమీందార్లు, వీర్రాజువంటి ప్రజా విరోధులు నేడు కాంగ్రెసులో ఎలా చేరుతున్నారో వివరించారు. జయజయ ధ్వనులతో సభ ముగిసింది.

వీర్రాజు ముఠాకు యిదిగిట్టలేదు. కొత్తగా తగిలించుకున్న కాంగ్రెసుబురఖా తనకేవుండాలని వానికోర్కె. గాంధీజయంతి తక్కినవాళ్ళు జరిపితే తనకు కాంగ్రెసు నాయకత్వం రాదని యీర్ష్య - చవ్వనాతనం.

అందుచే 8 వతేదీ ఉదయం తగువులాటకు తయారయ్యాడు. ఆరోజునే ఓటర్లను చేర్పు కోడానికి తహసీల్దారు వెంట్రప్రగడలోక్యాంపు వేశారు. దానికి ప్రజలను కమ్యూనిస్టులు తీసుకువస్తున్నారు. వీర్రాజు యింటిముందు వీధిలోనుంచి వస్తుండగా వీర్రాజుముఠా తాగుబోతులుఅడ్డుతగిలారు. కూచిపూడి సుబ్బయ్య, తాత, కాట్రగడ్డ సూర్యనారాయణ వగైరాలతో కలసి వీర్రాజు కర్రలతో దెబ్బలాటకు వచ్చాడు. కొసరాజు జగన్మోహనరావు, బ్రహ్మయ్య, నర్రా కోటేశ్వరరావు, వాగర్లమూడి బాపయ్యగార్లకు దెబ్బలు తగిలాయి. వెంటనే గ్రామస్తులంతా పోగయ్యారు. వీర్రాజుకు, త్రాగుబోతుల ముఠాకు తగిన విధంగా బుద్ధిచెప్పారు.

వోటర్లనుచేర్పించేగడువు యీనెల 15

ఆంధ్రరాష్ట్ర రైతుసంఘ ప్రధానకార్యదర్శి సందూరి ప్రసాదరావుగారిలారాస్తున్నారు:

కృష్ణాజిల్లా గెజిటు ఇప్పుడే చూశాను. అందులో అక్టోబరు 31 తేదీవరకూ ఓటర్లను చేర్పించుటకై తాశీల్దారుల ప్రోగ్రాములు ప్రకటింపబడ్డాయి. అందువల్ల చాలామంది రైతు వర్కర్లు ఓటర్లను చేర్పించుటకై గడువు పెంచబడ్డదనుకుంటున్నారు. కాని అది పొరపాటని తెలియజేస్తున్నాను.

ఓటర్ల లిస్టులు ఇప్పుడు రెండు రకాలుగా సవరింపబడుతూ వున్నాయి. (1) జనరల్ రివిజను ఇది 31-10-45 వరకూ జరుగుతూవుంటుంది. కాని ఈ విధంగా చేర్పించబడ్డవారు ఫిబ్రవరిలో రాబోవు శాసనసభల ఎన్నికలలో అర్హులు కారు. (2) జనరల్ రివిజను ఆలస్యంఅవుతుంది కాబట్టి త్వరగా సవరించుటకై జరిగే స్పెషల్ రివిజను 15—10—45 వరకూ జరుగుతుంది. స్పెషల్ రివిజనులో ఓటర్లుగా చేర్చబడ్డవారే ఫిబ్రవరిలో జరుగబోయే ఎన్నికలలో పాల్గొనటానికి అర్హులౌతారు

మనకు రాబోయే ఎన్నికలు అత్యంత ప్రధానమైనవి కాబట్టి స్పెషల్ రివిజనులోనే ఓటర్లనందర్నీ 15-10-45 లోగా చేర్పించడానికి ప్రయత్నించాలి.

దరఖాస్తు ఫారాలను యెవరైనా అచ్చు వేయించుకోవచ్చు. కాని, ఇవి ప్రభుత్వ దరఖాస్తు ఫారాలవలెనే వుండాలిగాని, ఒక్క అక్షరం కూడా మారకూడదు.

అద్దె యింట్లో కాపురమున్నవారందరికి వోటు వుంటుందని పొరబాటు పడ్డారు. అద్దె యింటి వంతటినీ ఆక్రమించుకొని కాపురముంటున్న ఒక్క గృహస్తుకే ఓటుహక్కు వుంటుంది. గృహ యజమానికి వేరే వోటు వుంటుంది.

కొన్ని జిల్లాలలో, తమకు ఆజ్ఞలు రాలేదనే నెపంపై రిజిష్ట్రేషనుఆఫీసర్లు నిమ్నజాతులవారిని ఓటర్లుగా చేర్చుకొనుటలేదట; నిమ్నజాతులవారు కూడా జనరల్ నియోజక వర్గములలోనివారే కాబట్టి, వారినికూడ వోటర్లుగా చేర్పించి తీరాలి. అట్లా చేర్చుటకు అధికారులు నిరాకరించినచో, వోటర్ల జాబితాను తయారుచేసి, విద్య, మొదలగు అర్హతలు గల్గినవారి దరఖాస్తులను పూర్తిచేసి రిజిష్ట్రేషన్ ఆఫీసర్లకు (డిప్టీ కలెక్టరుకు) రిజిష్టర్డు పోస్టు ద్వారా పంపాలి. అప్పటికి వీరిని చేర్చుకోకపోతే 21-11-45 నిమ్మట 4-12-45 లోగా క్లెయిములను పెట్టుకోవాలి.

కార్మిక నియోజకవర్గంలోని వోటర్లకు విద్య, ఆస్తి మొదలగు ఇతర అర్హతలున్నచో వారిని జనరల్ నియోజకవర్గంలో కూడా వోటర్లుగా చేర్పించాలి. అట్లాచేసినచో వారు జనరల్ నియోజకవర్గంలో కూడా వోటు చేయుటకు హక్కును కల్గియుంటారు.

రైల్వేయజమానుల దాడిని కార్మికులెదుర్కొంటున్నారు

"కార్మికవర్గంమీద నిరుద్యోగవుప్రళయం రాబోతున్నది. కష్టకాలంలో దేశరక్షణకు తోడ్పడిన రెండున్నర లక్షల రైల్వే కార్మికులకు నిరుద్యోగం రాబోతున్నది. ఈ అన్యాయాన్ని కార్మికవర్గం సహిస్తుందా?" అంటూ ఉద్రేకపూరితంగా కామ్రేడ్ వెంకటస్వామి (బాటరీమన్)ఉపన్యాసం చేస్తున్నారు యం. అండ్ యస్. యం. రైల్వే కార్మిక సంఘపు కదిరి సెక్షన్ (శాఖల బ్రాంచి) మహాసభలో, సభాస్థలంలోని ఐదు వందల మంది కార్మికులు చెవులప్పజెప్పి వింటూ, తమ సంఘటితశక్తితో రానున్న కష్టాలను యెదుర్కోవడానికి నిశ్చయించుకుంటున్నారు. ఇంతకు పూర్వం యూనియన్ సభ్యులుగా చేరమంటే - యిదుగో చేరుతాం — అదుగో చేరుతాం అంటూ వెళ్ళిపొయ్యేవారు కార్మికులు. ఈ రోజో : "కప్పైలు, కాయగూర్లు మేము తెస్తాం - పందిళ్లు మేము వేస్తాం" అంటూ ముందుకొచ్చారు. గ్యాంగ్ కార్మికులు, మనిషికి 8 అణాల చొప్పున రు. 50 లు వసూలుచేశారు. ఒక ప్రక్క పందిళ్లు వేసేవారు; ఒక ప్రక్క మీటింగు ప్రదేశాన్ని శుభ్రంచేసేవారు. వేరొక ప్రక్క కాయగూరలు తరిగేవారు. ఎటు జూచినా చేతులు ముడుచుకొని కూర్చున్న కార్మికుడొక్కరూ కనిపించలేదు. ఈ దీక్షయే సభ విజయవంతం కావడానికి తోడ్పడింది.

పెద్దల సహకారం

కరువు కాలకాల్లో, ప్రయాణ సౌకర్యాల్లో ఏనాడూ తమకు ఇండ్లను అసి యిబ్బంది కలిగించని రైల్వేకార్మికుల్ని పట్టణ పెద్దలు మరుస్తారా : "మేము సభజరుపుకుంటున్నాం మాకు సహకారం చేయండి" అని అర్థించగానే విశ్వనాథ్ ప్రెస్‌మేనేజరు కరపత్రాలు వేయించి యిచ్చారు. కాంగ్రెస్, లీగు పెద్దలు పరదాలు పట్టాలు తీసుకెళ్ళమన్నారు. పంచాయితీబోర్డువారు మీటింగుకుప్రదేశాన్నిచ్చారు. 30 ఏండ్లు రైల్వేమేస్త్రీగా పనిచేసిన రామయ్యగారు తనబిడ్డలు చేస్తున్న కృషికి సంతసించి నాయకుల నాహ్వానించి భోజనవసతులేర్పాటు చేశారు.

అరమైలు ఊరేగింపు

23 వ తేదీ 1½ గంటల నుండి 4 గంటల వరకు 75 మంది యింజనీరింగు ట్రాఫిక్ కార్మిక ప్రతినిధులు తమను ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యల్ని పూర్తిగా చర్చించాక, బ్యాండు వాయిద్యాలతో "2½ లక్షల మందిని తీసివేయకూడదని, కార్మికనాయకులను విడుదల చెయ్యాలి, కార్మికప్రజాఐక్యత వర్ధిల్లాలి" మొదలగు నినాదాలతో అరమైలు పొడుగు వూరేగింపు పట్టణ పెద్దబజారుల గుండా సభాస్థలాన్ని చేరుకుంది.

పచ్చటి తోరణాలతో కళకళలాడుతూన్న పందిరిలో కామ్రేడ్ కె. రామమూర్తి (పాకాల బ్రాంచి కార్యదర్శి) జయజయధ్వానాలమధ్య అధ్యక్షపీఠాన్ని అలంకరించారు. ఒకరు తరువాత ఒకరుగా కార్మికులు తమ కష్టసుఖాలను తెలియజేస్తూ ముందున్న పోరాటంలో తమ మాతృసంస్థ అయిన అఖిలభారత రైల్వే కార్మికసంఘం అడుగుజాడలను నడుస్తామని శపథంచేశారు. స్థానిక రైతు నాయకులు కామ్రేడ్ చింతలయ్య బ్రిటిషు గవర్నమెంటు మోసాన్ని బట్టబయలు చేస్తూ, కార్మిక వర్గానికి రైతుసంఘం అన్ని వేళల అండగా నిలుస్తుందని అభయమిచ్చారు. అధ్యక్షులు ముందున్న క్లిష్టపరిస్థితుల్ని తెలియజేస్తూ ఆక్లిష్టసమస్యలనుండి బయటపడడానికి కార్మికవర్గం మేలుకోవాలని హెచ్చరించారు.

1942 సంగులో అన్ని పార్టీలచే తిరస్కరింపబడిన క్రిప్సు ప్రతిపాదనలనే బ్రిటిషు గవర్నమెంటుయిప్పుడు దేశంమీద రుద్దప్రయత్నించుట ఇంగ్లాండు హిందూదేశాల ప్రజల్ని మోసంచేయ జూచుటే అని, యీ కుతంత్రాలను భగ్నంచేయడానికి కాంగ్రెసు లీగులు కలసి పనిచెయ్యాలని, వయోజనులందరికి వోటింగుహక్కుండాలని, రైల్వేబోర్డు 2½ లక్షల రైల్వే కార్మికుల్ని తగ్గించ జూచుట అన్యాయమని, దేశాన్ని పారిశ్రామికంగాచేసి అందరకు పనులు కల్పించమని తీర్మానించేరు. గుత్తి, మదనపల్లి, డాక్టర్లు చిత్తూరు పి. డబ్ల్యు. యినస్పెక్టరు చేస్తున్న అక్రమ చర్యలకు వెంటనే అధికార్లు తగుచర్య తీసుకోవాలని తీర్మానించారు.

మహాసభ జయప్రదంగా జరగడానికి కామ్రేడ్ నరసింహులు చేసిన అపార కృషిగమనించదగ్గది. ఈయన సాధారణ గ్యాంగికూలి. వయస్సులో చిన్న అయినప్పటికి, తన స్వార్థరహితమైన సేవవలన కార్మికులందరికీ పెద్దఅయ్యారు. తలలోని నాల్క అయ్యారు.

పేపరుమిల్లులో కరువుభత్యం కోత

ఆంధ్రా పేపరుమిల్లు(రాజమంద్రి) మేనేజరు 1-10-45 న రు. 50 నెల జీతము కంటే తక్కువ గల వారికి రు. 15 కరువుభత్యం నుండి రు. 10లకున్నూ, రు. 50 జీతము కంటె ఎక్కువగల వారికి యిచ్చే రు. 25% కరువు భత్యం నుండి 20% కున్నూ, 6 నెలల కు తక్కువ సర్వీసు గల వారికి పూర్తిగా కరువు భత్యమును తగ్గించామని ప్రకటించారు. దీనివలన మిల్లు కార్మికులందరిలోను తీవ్రమైన ఆందోళన చెలరేగింది.

యీ మిల్లులో గవర్నమెంటు ప్రకటించిన కరువుభత్యము కన్నా తక్కువయిస్తున్నప్పటికిని, చాలీ చాలని కరువుభత్యముతో మిల్లు కార్మికులు యుద్ధపు రోజులలో పేపరు ఉత్పత్తిచేసి రాష్ట్రములోగల పేపరు కరువును కొంతవరకు తగ్గించారు.

జీవితావసర వస్తువుల ధరలు తగ్గకపోగా రోజురోజుకు హెచ్చుతున్నప్పుడు అకారణంగా కరువుభత్యం తగ్గించడంవల్ల కార్మికులకు దుర్భరపరిస్థితులు కలిగినవి.

ఈనెల 3 వ తేదీ ఉదయం 300 మంది కార్మికులు మేనేజరును కలుసుకొని, కరువు భత్యమును తగ్గించవలదని అడిగారు, అందుకు మేనేజరు నెలకు రు. 250 నష్టం వస్తుందని, ఈతగ్గించేయడం తనకు బాధకరంగా వున్నదని, తగ్గించడం, తగ్గించకపోవడం "కైలాస్ అప్టే కంపెనీ"వారి చేతిలో వున్నదని, కార్మికులు సమ్మెచేస్తే విడుదల చేయబడు నైదికులను మిల్లులో చేర్చుకొనుటకు అర్జీలు వచ్చినాయని, అంతగా లేకపోతేమిల్లును కట్టివేసి పోతామని — కుంటిసాకులుచెప్పి బెదరించారు.

ఈ కైలాస్ అప్టే కంపెనీ సోదరులైన అహమ్మదాబాద్ టెక్స్‌టైల్ మిల్లు యజమానులు కరువుభత్యం తగ్గించడానికిపూనుకొన్నపుడు ప్రస్తుతం తగ్గించరాదని బొంబాయి ఇండస్ట్రియల్ కోర్టువారు తీర్పు యిచ్చారు. దీనినైనా గుర్తుకు తెచ్చుకోవాలని కోరుచున్నాము.

బెజవాడలో ప్రెస్ లాకౌటు

29-9-45 వతేదిసాయంత్రంవైశ్యరత్న ప్రెస్‌వర్కర్సు, (బెజవాడ ప్రెస్)మేనేజరుగారిని తమ సెప్టెంబరు నెలజీతం ఒక రోజు ముందుగా ఇవ్వమని అడిగారు. 30 వ తేదీతో నెల ఆఖరుఅవుతుంది. ఆ రోజు సెలవుదినం కనుక తమజీవితావసర వస్తువులు కొనుక్కొనే నిమిత్తంఅడిగేరు. అలా యిచ్చుటకు నిరాకరించి, ఒకరోజు ముందుగా అడిగారు కాబట్టి, వర్కర్సు తమ యిష్టంవచ్చినట్లు ప్రవర్తిస్తున్నారని కుంటిసాకు చెప్పి, 1-10-45 వ తేదీ నుంచిప్రెస్‌మూసివేసినారు. ఈయనదృష్టిలో వర్కర్సు ఎంత తేలికగావున్నారో చూడండి:

యిందులో కొంతమందికి డబ్బు ఆశ చూపి, తనచేతిలో వుంచుకోవాలని చూశారు. వర్కర్సులోవున్న ఐక్యతను చెడగొట్టి తమ ఇష్టం వచ్చినట్లు వర్కర్సును వుపయోగించుకోవడానికి ప్రయత్నిస్తున్నారు. యీవిషయం యజమానుల ఎసోసియేషన్‌కు తెలియపర్చినను, తమకు సంబంధంలేనట్లు వూరుకున్నారు. యజమానుల ఎసోసియేషన్ - వర్కర్సు యూనియన్‌వారు కలిసి లోగడ చేసుకున్న ఒడంబడికను వీరు గుర్తించినట్లు కనబడడం లేదు.

3-10-45 వ తేదీ సాయంత్రం 200 మంది ప్రెస్ కార్మికులతో పెద్దవూరేగింపు జరిగింది. శ్రీ హనుమంతరాయ గ్రంథాలయంలో బహిరంగసభ జరిగింది. ఈ సభకు శ్రీ టి. వెంకటేశ్వరరావు (బెజవాడ పట్టణ ఆహారకమిటీ కార్యదర్శి) అధ్యక్షత వహించారు. ఆంధ్రరాష్ట్ర ప్రెస్‌యూనియన్ ప్రధానకార్యదర్శి కామ్రేడ్ పిల్లలమర్రి వెంకటేశ్వర్లుగారు వివిధ పరిశ్రమలలో యజమానులు కార్మికులను ఏ విధంగా యిబ్బంది పెట్టుచున్నది, యుద్ధం అయిపోయిందికదాయని షిప్‌యార్డు కార్మికులను 700 మందిని తొలగించి యజమానులు పెట్టే యిబ్బందులను గురించి, వైశ్యరత్న ప్రెస్‌లో జరిగిన అన్యాయమును గురించి, ప్రెస్ కార్మికులు ఐకమత్యంతోవుండి, ఏవిధంగా పనిచేయవలసినది వివరించుతూ మాట్లాడారు. తరువాత బెజవాడ ప్రెస్‌వర్కర్సుయూనియన్ ప్రధానకార్యదర్శి యం. వెంకటేశ్వరరావుగారు ప్రెస్ కార్మికులు 1939 లో యుద్ధం వచ్చినతరువాత సిరా, కాగితం, మిషనరీ మొదలగుసామాన్లు దొరకనిరోజుల్లో పొదుపుగావాడి పని చేశామనియు యీ విధంగా పనిచేయించుకొని అనేక లాభాలు సంపాదించాక, యుద్ధం అయిపోయిందని, లాభాలు తగ్గుతాయని, ఏవిధంగా కార్మికులను తగ్గించాలో ఎత్తులువేస్తూ కొంతమంది యజమానులువేసే కుయుక్తులను వివరిస్తూ మాట్లాడారు. తర్వాత క్రింది తీర్మానాలు గావించిరి : "వైశ్యరత్న ప్రెస్‌లో పనిచేయుచున్న వర్కర్సు 30 వ తారీఖు ఆదివారం అగుటచేత 29—9—45 తారీఖున జీతం ఇవ్వాల్సినదిగా కోరగా యిస్తానని రాత్రి 9 గంటల వరకు వుంచి, ప్రెస్ మేనేజరు జీతం ఇవ్వ నిరాకరించుటయేగాక, జీతం ఇవ్వమని గట్టిగా అడిగినందుకు క్రోధం వహించి, ఏమాత్రం నోటీసుగాని కారణాలుగాని లేకుండానేప్రెస్‌ను మూసివేసి కార్మికులను నిరుద్యోగులుగా చేసినారు. యజమానుల ఎసోసియేషన్ - వర్కర్సుయూనియన్‌వారు యిద్దరు కలిసి ప్రతి విషయం పరిష్కరించుకోవాలని, లోగడ ఎగ్రిమెంటువున్నను సదరు లాకౌట్ తమకు సంబంధించనట్లుగా వూరుకొన్నారు. గనుక ప్రెస్‌ను వెంటనే తెరవవలయునని, ఒడంబడికను వెంటనే అమలుజరుప వలయునని కోరుచూ పురజనులు, ప్రభుత్వం వెంటనే చర్యతీసుకొని యథాప్రకారంగా ప్రెస్‌ను తెరిపించాలని" యీ సభవారు తీర్మానించారు.

★

వర్తక గుమాస్తాపై దౌర్జన్యం

ఏదో ఒక సాకుతో కార్మికులను అవమానాలకు గురిచేయడం యజమానులకు అలవాటయింది. ఇది రాజమండ్రిలో జరిగిన సంఘటన. 24-9-45 తేదీని కలప అడితి సెక్షనులో చక్కా నరసింహారెడ్డిగారి గుమాస్తా ర. ధి రామమూర్తిగారిని రావుసాహెబ్ చుక్కా అప్పలస్వామిరెడ్డి కుమార్డు కృష్ణారెడ్డి అకారణంగా తిట్టి, కొట్టాడు. అక్కడతో ఆగలేదు. ఈవిషయమై మాట్లాడడానికి వెళ్ళిన రాయబారపు సభ్యులను కృష్ణారెడ్డి తండ్రిఅయిన రావుసాహెబ్‌గారు అగౌరవపరచడానికి కూడా జంకలేదు.

ఈ దుర్మార్గాలను రాజమంద్రి ఎంప్లాయీస్ యూనియన్‌ఖండిస్తూ తీర్మానించింది.

నేతకార్మికులపై మాష్టర్‌వీవర్ల కొత్తదాడి

బాపట్ల తాలూకా చేనేత పారిశ్రామిక సంఘ కార్యదర్శి బండ్ల గరటయ్య గారిలా రాస్తున్నారు:

"బాపట్ల తాలూకాలో వేటపాలెం, చీరాల కేంద్రాలలో సుమారు 6500 మగ్గాలున్నాయి. వేలకొలది చేనేత పారిశ్రామికులు, యీ ప్రాంతంలో చేనేతపైనే బ్రతుకుతున్నారు. లక్షలకొలది రూపాయల వ్యాపారం, ప్రతి నెలా సాగుతుంది.

నూలు రేషనింగు ప్రారంభించి నప్పటికి గడచిన 6 నెలలనుండి నూలు సప్లయిలేక నెలలో పదిహేను దినాలే పనిఉండడంవల్ల చేనేతవారు తిండికి బాధపడుతున్నారు. దీనికితోడు, మూలిగే నక్కమీద తాటికాయ పడ్డట్లు మాష్టరు వీవర్లు మజూరీలుకూడా తగ్గించివేశారు. ఉదాహరణకు:

రకం	నూలు నెంబరు	పొడవు (వెంట్లుయిచ్చి)	6 నెలలనాటి మజూరి	ఇప్పటి మజూరి
సాదా చీరెలు	40 నెం.	30 గజాలు నేస్తే	15 రూ.	8 రూ.
..	60 నెం.	.. ..	20 రూ.	12 రూ.
..	80 నెం.	.. ..	25 రూ.	15 రూ.
గింగాం షర్టింగ్	40 నెం.	18	15 రూ.	3½ రూ.

ఈ ప్రకారమే మిగిలిన రకాలకుకూడ తగ్గించారు. ఇంకా తగ్గిస్తారని చెప్పుతుంటున్నారు. చేనేత పారిశ్రామికులలో విపరీతమైన కలకలం బయలుదేరింది.

ఇతర ప్రాంతాలకు గుడ్డల ఎగుమతి తగ్గినమాట నిజమే: కాని గుడ్డలరీదు తగ్గలేదు. యుద్ధం ఆగిందనే సాకుతోను, గుడ్డ విడుదల అవడంలేదనే సాకుతోను, మజూరీలను తగ్గించివేసి, మాస్టరు వీవర్లు చేనేత పారిశ్రామికుల గొంతులు నులిమివేస్తున్నారు. మాస్టరు వీవర్లు తమ సంఘాలద్వారా ఆలోచనలు చేసుకొని యిలా తగ్గిస్తున్నారు. వర్తకుల సంఘాలను ఆర్గనైజు చేసిన ప్రగడ కోటయ్య వగైరాలను మజూరీలు తగ్గించి వేశారేమిటి అడిగితే, మాట్లాడడంలేదు.

చేనేత పారిశ్రామిక సోదరులు వెంటనే మేల్కొని స్థానిక చేనేతపారిశ్రామిక సంఘాలద్వారా, మజూరీలు తగ్గించగూడదని ఆందోళనచేయాలి. యీనాడు మనకు కావలసిన జీవితావసర వస్తువుల ధరలు ఏమీ తగ్గలేదు, అధిక ధరలకే కొనవలసి వస్తున్నది. నూలు దొరకని కారణంగా, ఇప్పటికే తిండికి గడవక బాధపడుతూంటే, మజూరీలు తగ్గింపువల్ల ఉపవాసాలుచేసి ప్రాణాలువదలవలసి వస్తుంది. అందుచేత జీవితావసర వస్తువులధరల ననుసరించి మజూరీలు నిర్ణయించమని ప్రభుత్వాన్ని కోరాలి. గింగాం షర్టింగు వగైరాలకు ఎగుమతి అవకాశం కలిగించమని కోరాలి. ఇందుకు తగు ఆందోళన చేయవలసినదిగా సోదర పారిశ్రామికులను, సంఘాలవారిని కోరుచున్నాను."

ఇతర చోట్లలో

యుద్ధం ముగిసింది. చేనేత బట్టల వ్యాపారం పడిపోయిందనే సాకుతో మజూరీలు తగ్గించి చేనేత పారిశ్రామికుల్ని పీడించడం ఈ పైప్రాంతాల్లోనే కాదు. తెనాలి తాలూకాలో కూడా జరుగుతూంది. తాలూకా చేనేత కార్మిక సంఘాన్ని చేతిలో పెట్టుకొని లోగడ దొంగవ్యాపారంద్వారా అధికలాభాలు గుంజినవారే నేడు ఈ మాటుకానిమ్మూడా ఒడిగట్టుకుంటున్నారు. వీరిని గురించి కామ్రేడ్ దాని చిన అమ్మయ్యగారు యిలారాస్తున్నారు.

"వీరిలో ఒకరు-దాదివర్తి శివయ్యగారు. వీరు తెనాలితాలూకా చేనేత పారిశ్రామికసంఘానికి అధ్యక్షులు. తాలూకాలోగల చేనేతపారిశ్రామికుల అవసరాలన్నిటినీ గుప్పిటలో పెట్టుకొని, పారిశ్రామికుల రక్షణకు పూనుకున్న వారిలో వీరొకరు. ఈయన మాష్టరువీవరు-యారన్ డీలరు - అద్దకందారు యింకేగావాలి.

దామర్ల నాగేశ్వరరావు మరొకరు. వీరు తాలూకా చేనేత సంఘానికి కార్యదర్శి. వీరు తాలూకా హోల్‌సేల్ యారన్ డీలరు. అద్దకందారు గూడా. వీరికితోడు మరో అర్థరు యారన్‌డీలర్లు వున్నారు.

ఇలాంటి పెద్దలు సంఘ బాధ్యులుగావుంటే చేనేత పారిశ్రామికుల పాలిట రక్షకులు ఎలా కాగలరు? ఎలుకకు పిల్లులు సంఘ పెద్దలా? మచ్చుకు వీరు చేస్తున్న అన్యాయాలు కొన్ని చెపుతాను.

1. తెనాలి టౌనులోగల 400 మగ్గాలలో 60 నెంబరు నూలునేసే మగ్గాలు యే ఒకటి రెండో మినహా మరి లేవు. యధావిధిగా 60 నెంబరు నూలుకోటా తెచ్చుకొని, బ్లాక్ మార్కెట్‌లో అమ్ముకొని, లాభాలు గణించారు.

2. యారన్‌డీలర్లు కృత్రిమపు కార్డులను సృష్టించి, రేషన్ కార్డుల కోటాలో ఇవ్వవలసినంత నూలు ఇవ్వకుండా మినహాయించుకొని, వచ్చిననూలు స్వంతఅద్దకం కార్ఖానాల్లో రంగు అద్దించి అదనపు లాభాలు గుంజుతున్నారు. దీనికితోడుకార్డులపంపకపుపెద్దలు కూడా ఈ ఘనులే!!

ఈ బాధలకుతోడు ఇటీవల 125 మగ్గాలు, పోయిన వేసవిలో అగ్నిప్రమాదానికి గురి అయ్యాయి. ప్రాణరక్షణే కష్టమైన ఆనాటి మంటల్లో మగ్గాలకుతోడు తయ్యారి అయిన వస్త్రాలు - మగ్గాలపైవున్న పడుగులు వరకు రామస్వీతి అయ్యాయి. వీరికి సహాయంగా అన్ని పక్షాల ప్రజాసేవకులు పాటుపడి దాదాపు25 వేలరూపాయలవరకుడబ్బువసూలు చేసి, బాధితుల్ని ఆపదలో ఆదుకొన్నారు. కాని సంఘనాయకులమని చెప్పుకొనేవారు నిత్యం పారిశ్రామికుల ప్రాణాల్ని పీల్చటానికి తయారవడమే కాకుండా, మావస్త్రాలు సంగతేమిటి అంటూ, పారిశ్రామికుల పేర యధావిధిగాలాభాలు వేసుకొని, బాకీలు పేర్చి పెట్టారు. ఈ అన్యాయాన్ని తొలగించాల్సినదని నేను జిల్లా కలెక్టరువద్ద పారిశ్రామికుల సమక్షంలో మాష్టరు వీవరులను హెచ్చరించే సరికి, భుజాలు తడుపుకొని తెల్లమొగం వేశారు. ఈ రెండు సంవత్సరాలనుండి సంఘ పెద్దలమనుకొనే వారు చేస్తున్న మోసాలను, పారిశ్రామికులుస్పష్టంగానేచూడగల్గుతున్నారు. పారిశ్రామికులవెంటనే మాష్టరు వీవర్ల బారినుండి తప్పుకోడానికిప్రత్యేకసంఘనిర్మాణానికి పూనుకోవాలి. ఈక్రింది కర్తవ్యాలను నెరవేర్చుటకు పూనుకోవాలి.

1. రంగునూలు లైసెన్సులను పారిశ్రామికులేపొంది యారన్ డీలర్ల కృత్రిమ లాభాలకు స్వస్తిచెప్పాలి.

2. అగ్నికి ఆహుతియైన వస్త్రాల బాకీలు రద్దుకు పాటుబడాలి.

3. కార్డుల పంపకంలో జరుగుతున్న మోసాల్ని ఎదుర్కోవాలి.

4. వెంటనే మజూరీలు తగ్గించే ప్రమాదము క్రమ్ముకొస్తున్నది. దీనికి వ్యతిరేకంగా న్యాయమైన మజూరీలకు ఆందోళనచేయాలి.

5. కొత్తగా ఏర్పడబోయే "సుల్తాన్ నగర్" కాలనీలో పైపెత్తనదార్ల జోక్యం లేని కోఆపరేటివ్ సొసైటీని స్థాపించుకొనుటకు ప్రయత్నించాలి.

ప్రజాశక్తి చందావివరాలు

★

సంవత్సర చందా	5—0—0
అర్ధసంవత్సర చందా	2—8—0
మూడునెలలచందా	1—4—0

చీపురుపల్లి తాలూకాలో

కోటాదార్ల దురంతాలు

చీపురుపల్లి తాలూకాలో దాదాపు 1200 మగ్గాలున్నాయి. వీటి లెక్కలు తీయమని విశాఖజిల్లా చేనేత పారిశ్రామిక సంఘం (రంగాముఠా చేతిలో ఉంది.) కొంతమంది ఆర్గనైజర్లను నియమించింది. వీరు ఆపని రిటైల్ కోటాదార్లకు వప్పజెప్పారు. ఇకనీ కోటాదార్లు ఆడవలసిన నాటకమంతా ఆడారు. అదను దొరికింది కదా అని, ఒకే గ్రామానికి ఇద్దరేసి కూడా వెళ్లారు. లేనిమగ్గాలు కూడా వేసి చూపించారు. ఉదాహరణకు లాదేణ గ్రామంలో 82 మగ్గాలుంటే 116 కి లిస్టు తయారుచేశారు. అప్పాపురంలో 40 వుంటే, 70 లెక్కచూపారు. కొత్తవల్లిలో 40 కి 73 చూపారు. ఆకులములగాం, రామలింగపురం, అప్పాపురంగ్రామాలకు డబుల్‌లిస్టులు తయారయినట్లు కూడా తెలుస్తోంది. రామలింగపురానికి మొదట్లో మెట్టవల్లిలో కోటావుంటే, చీపురుపల్లి కోటాదారు సురి కాశయ్యగారి సత్యనారాయణ కూడా లిస్టు తయారుచేసి కోటా తెచ్చుకున్నారు.

మరికొన్ని ప్రాంతాల్లో కోటాదార్లు వీరికన్న ఘనులనిపించు కున్నారు. ఎవడో ఒక ఆసామీని వెంటబెట్టుకొని, "ఈయన మగ్గాలు తనిఖీ చేసే అధికారి. నూలు కంట్రోలు ఆఫీసరుగారు పంపించారు. కొత్త మగ్గాలకు కోటా వచ్చేలా చేస్తారు," అని చెప్పి మగ్గానికి 3 మొదలు 5 రూపాయల వరకు లంచాలు గుంజుతున్నారు. చీపురుపల్లి కోటాదారు ఈ విధంగానే జిల్లా సంఘంచేత పంపబడిన చదువుల ధర్మారావుని వెంటబెట్టుకొని, కొన్ని గ్రామాల్లో డబ్బు వసూలు చేశారు.

ఈ విధంగా డబ్బుదోచుకోవడం ఈకోటాదార్లు చేస్తున్న ఘాతుక కృత్యాల్లో ఒకటి. రెండవ దేమంటే - ఇద్దరు రెండు లిస్టులు తయారు చేయడంవల్ల, అవసరమయిన దానికన్నా అదనంగావచ్చే నూలును దొంగ మార్కెట్లకు చేరవేస్తున్నారు. అంతటితో ఆగక కోటా నూలును అమ్మేటప్పుడు కూడ 1, 2 గుల్లీలు తక్కువగా అమ్మి పూర్తిగా ఇచ్చినట్లు బిల్లులురాస్తున్నారు. ఇన్ని విధాలుగ ఈ కోటాదార్లు చేనేతపారిశ్రామికులను పీల్చిపిప్పిచేస్తున్నారు.

వచ్చిన కోటాను దాచేసి, నూలు రాలేదని దబాయించి, తరువాత అధికలాభాలకురహస్య వ్యాపారం సాగించడం కూడా జరుగుతూంది. ఈ విధంగా కర్లాం అనే గ్రామంలో ఒక వారం జరుగుతే, తాలూకా చేనేతకార్మిక సంఘకార్యదర్శి కామ్రేడ్ అప్పాయినాయుడు సర్కిల్ ఇన్‌స్పెక్టరుతో చెప్పారు. సంఘ అధ్యక్షుడు కామ్రేడ్ అంబళ్ళ సూర్యారావు జిల్లా టెక్స్‌టైల్ ఆఫీసరుతో చెప్పారు— కాని లాభం లేకపోయింది. ఈ అధికారుల వైఖరి దొంగ వ్యాపారులకే తోడ్పడేదిగా ఉంది. చీపురుపల్లి కోటాదారుమీద ఇలాంటి దొంగవ్యాపారంఫిర్యాదుచేస్తూ తాలూకాసంఘ కార్యదర్శి కొంతమంది చేనేతవారిని వెంటబెట్టుకొని తహసీల్దారువద్దకు వెళ్ళితే, ఆయనగారు "కమ్యూనిస్టులు పెట్టే సంఘాల్లో చేరితే మిమ్మల్ని అరెస్టుచేస్తాన"ని వారిని బెదరగొట్టబోయాడు. ఈ ధోరణి దొంగవ్యాపారానికి ఎలా దోహదం చేస్తూందో కార్యదర్శి స్పష్టంచేశాడు.

రంగా, ప్రగడ కోటయ్య ముఠా చేతిలో ఉన్న జిల్లా సంఘం చేనేత కార్మికుల్ని ఈ విధంగా దొంగవ్యాపారుల దోపిడీకి గురిచేయిస్తూ ఉంది. ప్రభుత్వాధికారులు ఈ దోపిడీకి మద్దతునిస్తున్నారు. కార్మికుల సంఘటితశక్తితోనే ఈ దారుణ పరిస్థితుల నెదుర్కొగలరు. ద్రోహంచేస్తున్నవారిని తన్ని, వారికెన్నాడూ స్థానం లేకుండా చేయాలి.

ప్రభుత్వం అధికారుల ప్రవర్తనను అరికట్టాలి.

— కార్డుల పద్ధతిమీద నూలు కోటా ఇవ్వాలి. అప్పుడు నిజమయిన లెక్క తేలడమే కాకుండా, మగ్గాలకు రేషన్ కూడా హెచ్చుచేయవచ్చు.

— జిల్లాకోటా ప్రతివారం సక్రమంగా వచ్చేలా చేయాలి.

— అక్రమప్రవర్తనను గురించి రిపోర్టు లురాగానే స్థానికాధికారులు తగుచర్య తీసుకొనేలా చేయాలి.

— అదనపు మగ్గాలను వెంటనే లిస్టులో చేర్చి, నూలుకోటా ఇప్పించాలి.

Editor: M. Chandrasekhara Rao, Printed and Published by Katragadda Rajagopala Rao at Prajasakti Press, Governorpet - Bezwada

END OF ISSUE